తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 110 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 శనివారం 21 - 11 - 2026వెల రూ. 2 రూ/

విద్యార్థులు ఉద్యోగులుగా కాదు
పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని.. బీజేపీ పోటీ కాదు'
- హిందువులను ఒకటి చేయడానికి మోదీ, అమిత్ షా ప్రయత్నం
- అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగుతున్న కాంగ్రెస్
- తెలంగాణ విద్యార్థులు ఉద్యోగాలు చేయడమే కాదు.. సంస్థలు స్థాపించాలి
- తెలంగాణలో ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ క్యాంపస్‌లు



హైదరాబాద్ :

కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్తోందని వెల్లడించారు. దేశ జనాభాలో 15 శాతం ఉన్న వాళ్లను కూడా కలుపుకుని వెళ్లాల్సిందే అని చెప్పుకొచ్చారు. బీజేపీ మైనారిటీ రిజర్వేషన్లను ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల కోసం పనిచేస్తోందన్నారు.ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య 100వ పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈరోజు విద్యానగర్‌లోని రామయ్య నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి.. ఆయనకు విషెస్ తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో అందే విద్య.. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అందించాలని నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం కూడా పెరిగిందన్నారు. పదో తరగతి తర్వాత డ్రాప్ అవుట్స్ బాగా ఉన్నాయని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం కోసం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని అన్నారు.స్కిల్స్ యూనివర్సిటీ బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తున్నారని.. ఇక్కడ చదువుకునే వాళ్లకు వంద శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐల్లో పాతకాలం చదువులే కొనసాగుతున్నాయని.. అందుకే ఐటీసీలుగా మార్చామని వివరించారు. ఐటీసీల కోసం నాలుగు వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని.. ఇందులో టాటా సంస్థ 86 శాతం ఖర్చు పెడుతోందని అన్నారు. - మిగతా 2 లో



నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?

- సీఎం రేవంత్ ప్రసంగంపై భగ్గుమన్న హరీశ్
- సిద్దిపేట సభలో సీఎం రేవంత్ వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యమిచ్చారన్న హరీశ్
- కరవు నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం అసత్యాలు, దూషణలకు దిగారని ఆరోపణ
- అబద్ధాల ప్రసంగాలు చేస్తున్నందుకు రేవంత్ ముక్కు నేలకు రాయాలని డిమాండ్

హైదరాబాద్ :

సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరమ్మ జీవిత బీమా సభ అట్టర్ ప్లాప్ కావడంతో - మిగతా 2 లో

రాజకీయ కక్షల కోసం
మహిళను అవమానిస్తారా?



- అసదుద్దీన్ ఒవైసీపై టీపీసీసీ చీఫ్ ఫైర్!
- రాజకీయ కక్షలకు మహిళను లక్ష్యంగా చేసుకుంటారా?
- కోట నీలిమపై వ్యాఖ్యలు సరికాదు
- ఒవైసీ వెంటనే క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్ :

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ - మిగతా 2 లో



చంద్రుడిపై బంగాళాదుంపల సాగు

- వ్యోమగాముల ఆహార భద్రతకు కీలక ముందడుగు!
- చంద్రుడి మట్టి నమూనాల్లో బంగాళాదుంపల విజయవంతమైన సాగు
- నాసా మద్దతుతో ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకుల కీలక ప్రయోగం
- సేంద్రియ ఎరువుతో కలిపిన మట్టిలో భూమితో సమానంగా దిగుబడి
- దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రల్లో వ్యోమగాములకు ఆహారం అందించడమే లక్ష్యం
- పండిన దుంపల్లో పోషకాలు భద్రం.. కొన్ని భార లోహాలపై తదుపరి పరిశీలన

ఢిల్లీ :

మానవుడు చంద్రుడిపై స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే దిశగా జరుగుతున్న పరిశోధనల్లో మరో కీలక ముందడుగు పడింది. చంద్రుడి ఉపరితలంపై ఉండే మట్టిని పోలిన - మిగతా 2 లో

డ్రగ్స్ రహిత
భారత్ నిర్మాణమే లక్ష్యం



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- డ్రగ్స్ రహిత భారత్‌కు ప్రజల భాగస్వామ్యం అవసరం
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం కావాలి
- మాదకద్రవ్యాలపై సమష్టి పోరాటం చేయాలి
- సామాజిక, ఆధ్యాత్మిక, విద్యాసంస్థలు చొరవ చూపాలి

ఢిల్లీ :

డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కోసం సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం పెరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టే కార్యక్రమాలు సాధారణ, నామమాత్రపు చర్యలకే పరిమితం కాకూడదని అన్నారు. ఈ ప్రయత్నాల్లో - మిగతా 2 లో



ఏపీలో చిన్న అణు రియాక్టర్లతో విద్యుత్

- ఎస్ఎంఆర్ సాంకేతికతపై ప్రభుత్వ దృష్టి
- ధర్మల్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎమ్ఆర్ అణు విద్యుత్
- ఏపీ ప్రభుత్వ అధికారిక ఆమోదం, జీవో విడుదల
- కాలం చెల్లిన ధర్మల్ ప్లాంట్లలో ఏర్పాటుకు పరిశీలన
- ఏపీజెన్‌కో ప్రతిపాదనలకు సర్కారు పచ్చజెండా
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి సైతం అనుమతి

అమరావతి :

థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా అత్యాధునిక అణు విద్యుత్ ఉత్పత్తి వైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ సాంకేతికత ఆధారంగా రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు అవకాశాలను - మిగతా 2 లో

శత్రువులను గడగడలాడించే అమెరికా ఫైటర్ జెట్

- ఎఫ్-22 రాప్టర్ యుద్ధ విమానాల కోసం పాతతరం మెమరీ కార్డులను వెతుకుతున్న అమెరికా
- డేటా బదిలీకి కనీసం 256 ఎంబీ సామర్థ్యమున్న పీసీఎంసీఐఏ, కాంపాక్ట్ ఫ్లాష్ కార్డుల అవసరం
- మిషన్ రూట్లు, రేడియో సెట్టింగులను విమాన వ్యవస్థలోకి లోడ్ చేసేందుకు వీటి వినియోగం
- 1980 నాటి ఎఫ్ఏటీ16 ఫైల్ సిస్టమ్ ఫార్మాట్‌కు మాత్రమే ప్రాధాన్యం

ఢిల్లీ :

ఆకాశాన్ని శాసించే అమెరికా అగ్రశ్రేణి యుద్ధ విమానం... శత్రువుల రాడార్లకు చిక్కని అత్యాధునిక ఐదో మిగతా 2 లో





ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

- 28 స్థానాల్లో ఏకంగా 27 కైవసం!
- టీడీపీకి 22 జడ్పీ ఛైర్మన్ స్థానాలు
- జనసేనకు 4, బీజేపీకి ఒక స్థానం
- వైసీపీకి దక్కిన ఏకైక అల్లూరి జిల్లా
- ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వివరాలు ఈసీ ప్రకటన

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో అధికార కూటమి విజయదుందుభి మోగించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 28 జడ్పీ పీఠాల్లో ఒక్క అల్లూరి జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాలను కూటమి తన ఖాతాలో వేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది.రాష్ట్ర - మిగతా 2 లో

తీరం దాటిన 'అక్వాన్' తుపాను


- ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు
- తీరం దాటే సమయంలో గంటకు 70 - 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు
- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీగా 168.75 మి.మీ వర్షపాతం నమోదు
- ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లు రద్దు చేసిన ఈస్ట్ కోస్ట్ రైల్వే

అమరావతి :

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో - మిగతా 2 లో

ఖనిజ సంపదే రాష్ట్రానికి బలం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలి
- గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు
- మైనింగ్ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలపాలి
- రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు
- ఐపీవో ప్రక్రియకు సీఎం చంద్రబాబు ఆదేశం
- కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు ఐదేళ్ల ప్రణాళిక



అమరావతి :

రాష్ట్ర ఖనిజ సంపదను భవిష్యత్ తరాలకు విలువైన ఆస్తిగా మలచడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎండీసీని ఎన్ఎండీసీ తరహాలో అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని సూచించారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనకు పరిమితం చేయకుండా వాటి విలువను పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు. గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులు ఇక్కడే వినియోగంలోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేసేందుకు వచ్చే - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 21 - 11 - 2026

సంపాదకీయం

ప్రవాసులకు ప్రోత్సాహకాలు ఏవీ?

విదేశాలలో జీవనోపాధి పొందుతున్న భారతీయులు తమ ఆర్జనతో మాతృదేశాన్ని అనితర సాధ్యంగా ఆదుకుంటున్నారు. వివిధ సందర్భాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమైనప్పుడు, ఇతర దేశాలతో పోల్చితే ఆ సంక్షోభాల తీవ్రత భారత్‌పై పెద్దగా ఉండకపోవడానికి కారణం ప్రవాస భారతీయులు స్వదేశానికి పంపే నిధులే. ఇది ఎవరూ నిరాకరించలేని వాస్తవం.ప్రవాస భారతీయులలో ప్రత్యేకించి, చిన్నాచితకా పనులు చేసుకోవడానికి అరేబియా గల్ఫ్ దేశాలకు వచ్చినవారు తమ కుటుంబాలకు పంపుతున్న నిధుల వాటా ఎక్కువగా ఉంటోంది. ఇది నిజం. భారత్‌కు సమకూరుతున్న విదేశీ మారకద్రవ్యంలో సగానికి పైగా ఎడారి దేశాల నుంచి వస్తుండగా మిగిలిన సగం అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా వస్తున్నట్లు రిజర్వు బ్యాంకు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.స్వదేశంలో ఉద్యోగావకాశాలు లేకపోవడంతో మెరుగైన ఉపాధికి విదేశాలకు వలస వెళ్తున్న యువ భారతీయుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తదనుగుణంగా వారు తమ కుటుంబాలకు పంపిస్తున్న నిధులూ పెరుగుతున్నాయి. 2012 సంవత్సరంలో మూడు లక్షల కోట్ల రూపాయలు పంపించిన ప్రవాస భారతీయులు, 2026లో ఇప్పటిదాకా రూ.12.8 లక్షల కోట్లు పంపించినట్లు అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రవాసులు పంపిస్తున్న నిధులను అధికమొత్తంలో అందుకుంటున్న రాష్ట్రాలలో తెలంగాణ నాల్గవ స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ ఆరవ స్థానంలో ఉంది.దేశ ఆర్థిక వ్యవస్థకు సవాళు ఎదురైన ప్రతిసారీ దాన్ని గట్టెక్కించింది ప్రవాస భారతీయులే. మన పాలకులు ఎందుకనో ఈ వాస్తవాన్ని బాహాటంగా అంగీకరించడం లేదు. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ప్రవాసులు పంపే నిధుల వాటా ఇంచుమించు 3శాతం అని అధికారిక నివేదికలే వెల్లడిస్తున్నాయి. అయినా ప్రభుత్వాలు ప్రవాసుల వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు!ఉభయ తెలుగు రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రమూ సగర్వంగా చెప్పుకునే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)తో పోల్చితే ప్రవాస భారతీయులు పంపే నిధులే ఎక్కువ. తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటి వరకు ప్రవహించిన మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లు కాగా, ఆ రాష్ట్రానికి చెందిన ప్రవాసులు ఒక్క సంవత్సరంలో పంపించిన మొత్తం నిధులు 12 బిలియన్ డాలర్లు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఎఫ్‌డీఐలు ఒక బిలియన్ డాలర్లకు మించకపోగా, ప్రవాసాంధ్రులు ఒక్క సంవత్సరంలో పంపించిన నిధులు 6.6 బిలియన్ డాలర్లు.భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాటా 1శాతానికి మించి లేదని కూడా అధికారిక గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. స్టాక్ మార్కెట్‌లో ఏ మాత్రం ఒడుదుడుకులు చోటుచేసుకున్నా ఆ ఎఫ్‌డీఐలు సైతం క్షణాలలో దేశం దాటి వెళ్లిపోతాయి. పెట్టుబడులు తీసుకువచ్చే ఒక విదేశీ కంపెనీకి మన ప్రభుత్వాలు ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తున్నాయి. అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. పన్ను రాయితీలతో పాటు భూ పందేరమూ చేస్తున్నాయి. ఏదో ఒక విదేశీ సంస్థ ప్రతినిధులు మన మంత్రులతో సమావేశమై సంప్రదింపులు జరపడం గురించిన వార్తలు ఫొటోలతో సహా నిత్యం పత్రికల్లో కనిపిస్తుంటాయి మరి.తాత్కాలిక విదేశీ పెట్టుబడుల కంటే మూడింతలు ఎక్కువగా శాశ్వత నిధులను తీసుకువచ్చే ప్రవాస భారతీయులను మన పాలకులు సరిగ్గా పట్టించుకోవడం లేదు. అసలు వారి గురించి కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయరు. ఇదేమి వైపరీత్యం! విచారకరమైన విషయమేమిటంటే దేశ ఆర్థికాభివృద్ధిలో తమ పాత్ర ఏమిటో సగటు ప్రవాసులకు సైతం తెలియదు, అటువంటి అవగాహనశక్తి వారికి లేదు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం తమ కష్టకాలంలో విదేశీ మారకద్రవ్యాన్ని సమకూర్చుకునేందుకు నానా కష్టాలు పడుతుంటాయి. భారత ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయకుండానే విదేశాలలోని భారతీయ శ్రామికులు, వృత్తి నిపుణులు మొదలైనవారు మాతృదేశానికి విదేశీ మారకద్రవ్యాన్ని దండిగా సమకూరుస్తున్నారు. జీడీపీలో 1శాతం కూడా ఉండని విదేశీ పెట్టుబడులకు సర్వం దాసోహమంటున్న దేశీయ ప్రభుత్వాలు, మూడు శాతానికి పైగా నిధులు తీసుకువస్తున్న ప్రవాసులను నిరాదరిస్తున్నాయి. ప్రోత్సాహం దేవుడికెరుక, కనీసం ప్రవాస భారతీయ పెట్టుబడిదారుల సాధకబాధకాలనూ వినడం లేదు. వినేందుకు శ్రద్ధ చూపడం లేదు. పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదు అనే నానుడి తెలుగు ప్రవాసుల విషయంలో మరింత నిజం.

ఖనిజ సంపదే రాష్ట్రానికి బలం

మొదటిపేజీ తరువాయి - ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు సీఎం ఆమోదం తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సంస్థ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీఓ ప్రక్రియ చేపట్టాలని నిర్దేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలను అధికారులు సమర్పించారు.ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణతో పాటు అదనపు విలువ కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నామన్న అధికారులు 74 వేల 860 చదరపు కిలోమీటర్ల పరిధిలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని 209 క్లస్టర్లుగా విభజించినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. పెండింగ్‌లోని క్వారీ లీజు దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంపైనా చర్చించారు. 6 వేల 500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి గడువు పొడిగించే ప్రతిపాదనలను అధికారులు పరిశీలనకు తీసుకొచ్చారు. ఈ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారమైతే ప్రభుత్వానికి సుమారు 400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపైనా ఏపీఎండీసీ దృష్టి పెట్టింది. ఒడిశా, ఝార్ఖండ్‌లోని 3 బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటోంది. ఈ మూడు బ్లాకుల్లో కలిపి 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.



ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం, కూటమి భాగస్వామ్య పక్షాల్లో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 22 జడ్పీ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకుంది. జనసేన పార్టీ 4 స్థానాలను, భారతీయ జనతా పార్టీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్‌కే పరిమితమైంది. అల్లూరి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా వైసీపీ అభ్యర్థి వంతల శాంతి ఎన్నికయ్యారు. జిల్లాల వారీగా ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా ముగియడంతో పాటు, ఎన్నికైన వారి పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల అధికారిక జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జిల్లా పరిషత్ పాలకవర్గాల ఎన్నికల ఘట్టం అధికారికంగా పూర్తయింది.

శత్రువులను గడగడలాడించే అమెరికా ఫైటర్ జెట్



మొదటిపేజీ తరువాయి - తరం స్టీల్త్ ఫైటర్ జెట్... గంటకు వేల మైళ్ల వేగంతో దూసుకెళ్లే ఎఫ్-22 రాప్టర్‌ను నడపాలంటే ఇప్పుడు సాంకేతిక ప్రపంచం ఎప్పుడో మరిచిపోయిన ఒక పాత వస్తువు కావాలి. ఆధునిక స్మార్ట్‌ఫోన్‌లో నాలుగైదు ఫోటోలు పట్టేంతటి మెమరీ కూడా లేని 256 ఎంబీ మెమరీ కార్డుల కోసం ఇప్పుడు అగ్రరాజ్యం వెతుకులాట ప్రారంభించింది.ఎఫ్-22 రాప్టర్ యుద్ధ విమానంలో మిషన్ సమాచారాన్ని ఫీడ్ చేయడానికి నేటికీ తొంభైల కాలం నాటి రిమూవబుల్ ఫ్లాష్ మెమరీ కార్డులనే వినియోగిస్తున్నారు. ఫైటర్ జెట్‌లోని డేటా ట్రాన్స్‌ఫర్ కార్ట్రిడ్జ్ (డీటీసీ) వ్యవస్థలో ఈ కార్డులు కీలకం. టేకాఫ్‌కు ముందు ఫ్లైట్ రూట్లు, రేడియో ఫ్రీక్వెన్సీ సెట్టింగ్స్, శత్రు ముప్పునకు సంబంధించిన డేటాను గ్రౌండ్ సిస్టమ్స్ నుంచి విమానంలోకి ఎక్కించేందుకు, అలాగే మిషన్ పూర్తయ్యాక ఫ్లైట్ వివరాలను రీడ్ చేయడానికి పైలట్లు వీటిపైనే ఆధారపడుతున్నారు.ప్రస్తుతం విపణిలో వందల గిగాబైట్ల, టెరాబైట్ల సామర్థ్యం ఉన్న స్టోరేజ్ డివైజ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ, రాప్టర్‌కు మాత్రం పాత కార్డులే కావాలి. కనీసం 256 ఎంబీ సామర్థ్యం ఉన్న పీసీ స్టాండర్డ్ 95 టైప్-2 ఫ్లాష్ కార్డులు లేదా ప్యాసివ్ అడాప్టర్లతో కూడిన కాంపాక్ట్ ఫ్లాష్ (సీఎఫ్) కార్డులను సరఫరా చేయగల అమెరికన్ కంపెనీల కోసం అమెరికా ఎయిర్ ఫోర్స్ తాజాగా నోటీసు జారీ చేసింది. ఆధునిక చిప్‌లు విమానంలోని పాత హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్‌కు సరిపోకపోవడమే దీనికి ప్రధాన కారణం.ఈ మెమరీ కార్డులు ప్రభుత్వ హోస్ట్ సిస్టమ్‌తో సమన్వయం కావడంతో పాటు, 1980ల నాటి ఫైల్ అలోకేషన్ టేబుల్ (ఎఫ్ఏటీ16) ఫార్మాట్‌లో ప్రీ-ఫార్మాట్ అయి ఉండాలని ఎయిర్ ఫోర్స్ నిర్దేశించింది. ఏవియానిక్స్ వ్యవస్థలతో సంపూర్ణ అనుకూలత సాధించడానికే ఈ నిబంధన విధించారు. తాజా అవసరాల కోసం ఎయిర్ ఫోర్స్ మార్కెట్ పరిశోధన ప్రారంభించింది. అర్హత గల సంస్థలు 2026 డిసెంబరు 1లోగా వివరాలు సమర్పించాలని కోరింది. 2030 వరకు ఈ రాప్టర్లను సేవల్లో కొనసాగించాలనే యోచనలో ఉన్న పెంటగాన్‌కు, ఈ పాతకాలపు విడిభాగాలను సంపాదించడం ఇప్పుడు ఒక సరికొత్త సవాలుగా మారింది.

చంద్రుడిపై బంగాళాదుంపల సాగు

మొదటిపేజీ తరువాయి - పదార్థంలో బంగాళాదుంపలను విజయవంతంగా పండించి శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారు. భవిష్యత్తులో చంద్రుడిపైకి వెళ్లే వ్యోమగాములకు అక్కడే ఆహారాన్ని ఉత్పత్తి చేసేందుకు ఈ ప్రయోగం మార్గం సుగమం చేస్తోంది. నాసా మద్దతుతో ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు జరిపిన ఈ అధ్యయనం వివరాలు 'ఎన్‌పీజే మైక్రోగ్రావిటీ' అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.పరిశోధకులు 'మోడోక్' అనే బంగాళాదుంప రకాన్ని ఎంచుకుని, చంద్రుడిపై ఉండే మట్టిని పోలిన ఐదు రకాల నమూనాల్లో ప్రయోగాలు జరిపారు. చంద్రుడి మట్టిలో మొక్కల పెరుగుదలకు అవసరమైన నత్రజని, సేంద్రియ పదార్థాలు ఉండవు. దీంతో కేవలం ఆ మట్టి నమూనాల్లో మొక్కలు నాటగా వేర్లు కానీ, దుంపలు కానీ ఏర్పడలేదు. అయితే, ఈ మట్టి నమూనాలకు వానపాముల ద్వారా తయారైన సేంద్రియ ఎరువును (వర్మీకంపోస్ట్) కలిపినప్పుడు ఫలితాల్లో అద్భుతమైన మార్పు కనిపించింది. కేవలం 5% సేంద్రియ ఎరువు కలిపినా మొక్కలు వేర్లు తొడగడం, దుంపలు ఏర్పడటం ప్రారంభించాయి. ఇక 30% ఎరువు కలిపిన మట్టిలో పండిన పంట, భూమిపై ఒరెగాన్ బంగాళాదుంపల సాగు ప్రాంతంలోని మట్టిలో పండిన పంటతో సమానమైన దిగుబడిని ఇవ్వడం విశేషం.ప్రధాన పరిశోధకుడు ఐమెరిక్ గోయర్ మాట్లాడుతూ.. "చంద్రుడి మట్టిలో నత్రజని అస్సలు ఉండదు, కాబట్టి దానికి పోషకాలు జోడించకుండా ఏ పంటా పండదు" అని వివరించారు. ఈ ప్రయోగంలో పండిన బంగాళాదుంపలను విశ్లేషించగా, వాటిలో పోషక విలువలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తేలింది. అయితే, కొన్ని నమూనాలలో భార లోహాల శాతం స్వల్పంగా పెరిగినట్లు గుర్తించారు. దీనిపై మరింత లోతైన అధ్యయనం అవసరమని శాస్త్రవేత్తలు తెలిపారు.నాసా చేపట్టిన 'ఆర్టెమిస్' కార్యక్రమం కింద చంద్రుడిపై మానవుల స్థిర నివాసాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యానికి ఈ పరిశోధన ఎంతో కీలకం. భూమి నుంచి ఆహారాన్ని పంపించడం అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. దీనికి బదులుగా చంద్రుడిపైనే ఆహారాన్ని పండించుకోగలిగితే అంతరిక్ష యాత్రల భారం గణనీయంగా తగ్గుతుంది.తక్కువ ప్రదేశంలో ఎక్కువ కేలరీలు, పొటాషియం, విటమిన్-సి వంటి పోషకాలను అందించే బంగాళాదుంపలు అంతరిక్ష వ్యవసాయానికి అత్యంత అనువైనవిగా భావిస్తున్నారు. ఈ ప్రయోగాలను ప్రస్తుతం భూమిపై గ్రీన్‌హౌస్‌లో, చిన్న కుండీలలో నిర్వహించారని, భవిష్యత్తులో పెద్ద కంటైనర్లలో ప్రయోగాలు చేసి వాస్తవ పరిస్థితుల్లో సాగు సాధ్యమవుతుందో లేదో నిర్ధారించాల్సి ఉందని పరిశోధకులు పేర్కొన్నారు.

తీరం దాటిన 'అక్వాన్' తుపాను

మొదటిపేజీ తరువాయి - తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు.తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకబ్రద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది.తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు,అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

విద్యార్థులు ఉద్యోగులుగా కాదు.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ విద్యార్థులు సంస్థల్లో పనిచేయడం కాదని.. సంస్థలనే స్థాపించాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ లాంటి అంతర్జాతీయ విద్యా సంస్థలు తెలంగాణలో తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేయబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

రాజకీయ కక్షల కోసం మహిళను అవమానిస్తారా

మొదటిపేజీ తరువాయి - గౌడ్ తీవ్రంగా ఖండించారు.ఆ వ్యాఖ్యలు అనైతికమని పేర్కొన్న ఆయన, ఒవైసీ తక్షణమే తన మాటలను వెనక్కి తీసుకుని కోట నీలిమకు క్షమాపణ చెప్పాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఉత్తరప్రదేశ్‌లో ఒవైసీ సాగిస్తున్న రాజకీయ కార్యకలాపాలపై కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ పవన్ ఖేరా ఇటీవల విమర్శలు చేశారు. దీనికి ప్రతిస్పందనగా ఒవైసీ.. పవన్ ఖేరాను రాజకీయంగా ఎదుర్కోవాల్సింది పోయి, ఆయన భార్య డాక్టర్ కోట నీలిమను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. రాజకీయ చర్చలు ఎంత దిగజారిపోయాయో ఈ ఘటన నిరూపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.డాక్టర్ కోట నీలిమ ప్రజాజీవితంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు, స్థానం ఉన్న రాజకీయ నాయకురాలు" అని టీపీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలకే పరిమితం కావాలి: "పవన్ ఖేరాను విమర్శించే పూర్తి హక్కు ఒవైసీకి ఉంది. ఆయన కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించవచ్చు, మా రాజకీయాలతో విభేదించవచ్చు. కానీ రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ఒక మహిళ ఆత్మగౌరవాన్ని కించపరచడం ఏమాత్రం ఆమోద యోగ్యం కాదు" అని ఆయన పేర్కొన్నారు.ప్రజాజీవితంలో ఉన్న మహిళలకు ఇవ్వాల్సిన గౌరవాన్ని నిలబెడుతూ ఒవైసీ వెంటనే క్షమాపణ చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మరోవైపు, ఒవైసీ వ్యాఖ్యలను నిరసిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ

మొదటిపేజీ తరువాయి - సీఎం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. అసలు సభకు వచ్చిన పథకం గురించి మాట్లాడకుండా తన ఎత్తు, కేటీఆర్ గడ్డం వంటి వ్యక్తిగత విషయాలపై విమర్శలు చేయడానికే రేవంత్ వచ్చారా? అని ప్రశ్నించారు. సొంత జిల్లాలో జనం రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన విషయాన్ని అక్కడి పోలీస్ కమిషనరే స్వయంగా చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే సభలో బూతులు, అబద్ధాలు వల్లెవేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవంటూ సీఎం చెప్పడం పచ్చి మోసమని హరీశ్ ఆరోపించారు. అలాంటప్పుడు దేవాదుల దగ్గర మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి కేటాయించిన నీటిని ఎందుకు తోడలేకపోతున్నారని నిలదీశారు.కృష్ణా నదిలో రాష్ట్రానికి రావాల్సిన 299 టీఎంసీలను సైతం ఉపయోగించుకోలేని అసమర్థ స్థితిలో ఈ పాలన ఉందని విమర్శించారు. ట్రిబ్యునల్ ముందు సమర్థంగా వాదనలు వినిపించడంలో సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని, సభలో మాట్లాడిన పచ్చి అబద్ధాలకు గానూ సీఎం ముక్కు నేలకు రాయాలని హరీశ్ డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో పడి తెలంగాణ సాగునీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల దోపిడీకి కాంగ్రెస్ సర్కారే ప్రత్యక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు.

ఏపీలో చిన్న అణు రియాక్టర్లతో విద్యుత్

మొదటిపేజీ తరువాయి - పరిశీలించేందుకు ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) జారీ చేశారు.కాలం చెల్లి పదవీ విరమణకు చేరువైన థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థానాల్లో లేదా రాష్ట్రంలోని ఇతర అనువైన ప్రాంతాల్లో ఈ సాంకేతికత స్థిరపడిన తర్వాత ఎస్ఎమ్ఆర్ ఆధారిత అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రం యోచిస్తోంది. ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఈ మేరకు అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేసేందుకు పచ్చజెండా ఊపారు.కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు నిరంతర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఈ సరికొత్త న్యూక్లియర్ టెక్నాలజీ భవిష్యత్తులో అత్యంత కీలక పాత్ర పోషించనుంది. తక్కువ విస్తీర్ణంలో, సురక్షితమైన ఆధునిక ప్రమాణాలతో విద్యుత్ ఉత్పత్తిని అందించే ఈ ఎస్ఎమ్ఆర్ విధానాన్ని అమల్లోకి తేవడం ద్వారా రాష్ట్ర ఇంధన భద్రతను పటిష్ఠం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - సామాజిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు, విద్యాసంస్థలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు.సామాజిక న్యాయం, సాధికారత శాఖ నిర్వహించిన విభాగాల స్థాయి సదస్సు ముగింపు సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత భారత్ (నషా ముక్త్ భారత్) నిర్మాణం కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే దివ్యాంగులను ముందుగానే గుర్తించడం, వారిపై సమాజంలో ఉన్న వివక్ష, అపోహలను తొలగించడం కోసం ప్రజల భాగస్వామ్యం (జన్ భాగీదారీ) పెరగాలని అన్నారు. దివ్యాంగులకు అందుబాటు ధరల్లో సహాయక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు స్టార్టప్‌లను ప్రోత్సహించాలని సూచించారు.ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. సామాజిక సంక్షేమ పథకాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, అందుబాటు ధరల్లో సహాయక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి స్టార్టప్‌లను ప్రోత్సహించడం, డ్రగ్స్ రహిత భారత్ కోసం సమాజమంతా కలిసికట్టుగా పనిచేయడం వంటి అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు వెల్లడించారు.డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కోసం సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం పెరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టే కార్యక్రమాలు సాధారణ, నామమాత్రపు చర్యలకే పరిమితం కాకూడదని అన్నారు. ఈ ప్రయత్నాల్లో సామాజిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు, విద్యాసంస్థలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

కాకినాడ జిల్లాలో దారుణం

రాష్ డ్రైవింగ్‌ను ప్రశ్నించినందుకు కత్తులతో దాడి

అతివేగంగా బైక్ నడిపి వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా మందలించినందుకు కక్ష పెంచుకుని దాడిచేసిన ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో జరిగింది

రాష్ డ్రైవింగ్‌ను ప్రశ్నించినందుకు కత్తులతో దాడి

అతివేగంగా బైక్ నడిపి వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా మందలించినందుకు కక్ష పెంచుకుని దాడిచేసిన ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో జరిగింది. కిర్లంపూడి మండలం పాలెం గ్రామానికి చెందిన కరణం గంగాధర్ గురువారం రాత్రి పాలెం సెంటర్‌లో స్నేహితులతో మాట్లాడుతున్నారు. అదే సమయంలో గోనెడ గ్రామానికి చెందిన కొప్పిశెట్టి తిరుపతయ్య, అతని అన్న కొడుకు బైక్‌పై అతివేగంగా వచ్చి గంగాధర్ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో గ్రామంలో ఇలా ర్యాష్ డ్రైవింగ్ చేయడమేంటని గంగాధర్‌తో పాటు అక్కడున్న మరికొందరు వారిని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన తిరుపతయ్య, అతని అన్న కొడుకు గంగాధర్‌ను అంతుచూస్తామంటూ బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.అనంతరం మరో వ్యక్తిని వెంటబెట్టుకుని రాత్రి సమయంలో గంగాధర్ ఇంటికి చేరుకుని కత్తులతో దాడికి పాల్పడ్డారు. అన్నపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమ్ముడు గణేష్‌పైనా కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో గంగాధర్ మెడ, గడ్డం, చేతులకు గాయాలవగా గణేష్ ఎడమ భుజానికి గాయమైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు క్షతగాత్రులను వెంటనే పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితులను పట్టుకున్న గ్రామస్థులు ఉదయం దేహశుద్ధి చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు జాతీయ రహదారిపై నేడు(శుక్రవారం) రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జువ్వలదిన్నె నుంచి నెల్లూరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులు సూచిక బోర్డును ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతులను విడవలూరు మండలానికి చెందిన మేకల వంశీ, కొండూరు సుబ్రమణ్యంగా పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్సై ముత్యాలరావు దర్యాప్తు చేపట్టారు.పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం దిగ్గమర్రు బైపాస్‌లో రెండు కార్లు ఢీకొన్నాయి. ఘటనలో నలుగురు యువకులు, ఓ యువతికి గాయాలయ్యాయి. కోనసీ

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 21 - 11 - 2026

శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ నూతన చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్‌గా దాసరి సునేత్ర ప్రమాణ స్వీకారం





పుట్టపర్తి నవంబర్ 20 తెలుగుకలం : శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ నూతన పాలకవర్గం కొలువుదీరింది. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో అత్యంత కోలాహలంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్‌గా దాసరి సునేత్ర ఏకగ్రీవ మెజారిటీతో ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ నూతనంగా ఎన్నికైన చైర్మన్ పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్ దాసరి సునేత్రతో పాటు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల (జడ్పీటీసీ) చేత పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు జడ్పీటీసీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి శ్రీ సత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షించారు. నూతన చైర్మన్ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కూటమి నాయకులకు, జడ్పీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ పార్థసారధి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పెద్ద ఎత్తున హాజరై నూతన పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.

అనంతపురం జిల్లాలో 30 మండల పరిషత్ ఎన్నికలు పూర్తి.. కోరం లేక పలుచోట్ల వాయిదా

అనంతపురం నవంబర్ 20 తెలుగుకలం : జిల్లాలో మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుండగా, మొత్తం 30 మండలాలలో అధ్యక్షుల ఎన్నికలు మరియు 25 మండలాలలో ఉపాధ్యక్షుల ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయి. అయితే, తగినంత కోరం లేని కారణంగా జిల్లాలోని కొన్ని మండలాలలో ఎన్నికలను నిర్వహించలేకపోయినట్లు అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పామిడి మరియు కళ్యాణదుర్గం మండలాలలో కోరం లేకపోవడంతో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుల ఎన్నికలు నిలిచిపోయాయి. అదేవిధంగా, ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూర్, బెలుగుప్ప, కూడేరు, పామిడి మరియు కళ్యాణదుర్గం మండలాలలో కోరం లేని కారణంగా మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుల ఎన్నికలను అధికారులు నిర్వహించలేకపోయారు. కోరం లేక వాయిదా పడిన ఈ మండలాలలో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు తదుపరి ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు, వారు నిర్ణయించిన తేదీలలో మళ్లీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో స్పష్టం చేశారు.

అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులుగా గంజే నాగరాజు, ఉపాధ్యక్షులుగా వెన్నపూస లలిత

జడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం





అనంతపురం నవంబర్ 20 తెలుగుకలం : అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ (జడ్పీ) నూతన పాలకవర్గ ఎన్నికల ప్రక్రియ శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో అత్యంత ప్రశాంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా గంజే నాగరాజు, వైస్ చైర్మన్‌గా వెన్నపూస లలిత ఎన్నికయ్యారు. ఈ ప్రత్యేక సమావేశానికి జిల్లా కలెక్టర్ మరియు ప్రిసైడింగ్ అధికారి ఓ. ఆనంద్, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) విజయలక్ష్మి హాజరై ఎన్నికల ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. సమావేశం ప్రారంభంలో భాగంగా, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని ఆయా మండలాల నుంచి గెలుపొందిన నూతన జడ్పీటీసీ (జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ) సభ్యులందరి చేత జిల్లా కలెక్టర్ మరియు ప్రిసైడింగ్ అధికారి ఓ. ఆనంద్ నిబంధనల ప్రకారం ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం జడ్పీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల ఎన్నికలను నిర్వహించారు. ఇందులో గార్లదిన్నె జడ్పీటీసీ సభ్యులు, శింగనమల మండలం జూలాకాల్వకు చెందిన గంజే నాగరాజు జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులుగా (చైర్మన్), యల్లనూరు జడ్పీటీసీ సభ్యురాలు వెన్నపూస లలిత జిల్లా ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులుగా (వైస్ చైర్మన్) ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్ల చేత కూడా ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు.. విద్యార్థులకు బహుమతుల ప్రదానం



పెద్దవడుగూరు నవంబర్ 20 తెలుగుకలం : పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుందని, ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని పలువురు విద్యావేత్తలు సూచించారు. పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 రాముడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గౌసియా బేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రాముడు మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, విజ్ఞానాన్ని పంచే గొప్ప కేంద్రాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించే ఇతర పుస్తకాలను కూడా చదవడం వల్ల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గౌసియా బేగం మాట్లాడుతూ పుస్తకాలు మనిషికి నిజమైన జ్ఞాన సంపదని అన్నారు. మంచి పుస్తకాలు జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని చెబుతూ, "చినిగిన చొక్కా అయినా వేసుకో.. ఒక మంచి పుస్తకం కొనుక్కో" అనే సూక్తిని గుర్తుచేసి పుస్తకాల విలువను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయుడు షేక్షావలి మాట్లాడుతూ పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో ఆధ్యాత్మిక పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, చిన్నపిల్లల కథల పుస్తకాలు, నవలలు వంటి విభిన్న రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంపీపీ మెయిన్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, క్రీడా పోటీలు నిర్వహించామని, విజేతలకు ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ఉపాధ్యాయినులు, పీడీ రామచంద్ర, ఉపాధ్యాయుడు షేక్షావలి, డ్రాయింగ్ టీచర్ రాజు, గ్రంథాలయ పాఠకులు, సుమారు 60 మంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వంటకాలతోనే సంపూర్ణ ఆరోగ్యం డీఆర్వో ఏ. మలోల





అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : ప్రపంచ వారసత్వ వారోత్సవాలు -- 2026లో భాగంగా రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాల వద్ద "అనంతపురం ప్రాచీన వారసత్వ వంటకాలు" కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఏ. మలోల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి కాలంలో నాణ్యమైన ఆహారం అంటే అది కేవలం తృణధాన్యాలతో చేసిన వంటకాలు మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రాచీన కాలం నుండి వస్తున్న మన సంప్రదాయ వంటకాలు కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మసాలా వంటకాలు, రెడీమేడ్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాలను పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ సహాయ సంచాలకులు ఎం. స్వామి నాయక్ మాట్లాడుతూ, దైనందిన జీవన విధానంలో చిరుధాన్యాలు మరియు వ్యాయామాన్ని అంతర్భాగంగా చేసుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను సులభంగా నివారించవచ్చని పేర్కొన్నారు. ఫాస్ట్ ఫుడ్ సంస్కృతిని వీడి, మన పూర్వీకులు ఆచరించిన ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను నేటి తరానికే కాకుండా భావితరాలకు కూడా వారసత్వంగా అందించాలని ఆయన సూచించారు. అనంతరం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) కో-కన్వీనర్ పి. కృష్ణమూర్తి, సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మురళీకృష్ణ, షేక్ రియాజుద్దీన్, జూటూరి షరీఫ్, సాధు శేఖర్ మాట్లాడుతూ, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు జయంతి, శ్రీవల్లి, లేడీస్ క్లబ్ కార్యదర్శి పద్మజ, రోటరీ క్లబ్ ప్రతినిధి మేడ రామలక్ష్మి మాట్లాడుతూ, నేటి జీవన విధానంలో కుటుంబానికి నాణ్యమైన ఆహారం అందించడంలో ప్రతి గృహిణి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకోవడం వల్ల రక్తహీనత వంటి అనేక రకాల ఆరోగ్య సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రాచీన వంటకాల పోటీలకు డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రసన్న మరియు ప్రముఖ చెఫ్ రాకేష్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో బాలల పాత్ర కీలకం

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు





తాడేపల్లి (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం (20-11-26) గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ 'చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్' ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం మరియు ప్రాథమిక విధులపై అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సిస్టర్ విద్యా మాట్లాడుతూ, 18 సంవత్సరాలలోపు ప్రతి బాలబాలికకు గౌరవప్రదమైన జీవితాన్ని, భద్రతను అందించడానికి భారత రాజ్యాంగం మరియు ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒడంబడిక ప్రకారం జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ హక్కు మరియు భాగస్వామ్య హక్కు అనే నాలుగు ప్రధాన హక్కులు కల్పించబడ్డాయని తెలిపారు. పుట్టగానే సరైన పేరు, జాతీయతతో కూడిన గుర్తింపు హక్కుతో పాటు మంచి ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, ఆటపాటలు మరియు హింస, బాల కార్మిక వ్యవస్థ నుండి రక్షణ పొందే హక్కు ప్రతి బిడ్డకూ ఉంటుందని వివరించారు. హక్కులు, విధులు ఒకే నాణేనికి ఉన్న బొమ్మ బొరుసు లాంటివని, పిల్లలు తమ హక్కులను అనుభవిస్తూనే తోటివారి హక్కులకు భంగం కలగకుండా బాధ్యతలను నిర్వర్తించినప్పుడే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అనంతరం అత్తోట పోతురాజు మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ ప్రకారం ప్రతి పౌరుడికి 11 ప్రాథమిక విధులు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటూ జాతీయ జెండా, జాతీయ గీతం, జాతీయ చిహ్నాలను గౌరవించాలని సూచించారు. పిల్లలు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని మూఢనమ్మకాలను విడనాడాలని, మానవతావాదంతో పాటు కొత్త విషయాలను నేర్చుకునే తత్వాన్ని పెంచుకోవాలని అన్నారు. అంతేకాకుండా, హింసను విడనాడి పాఠశాలలు, పార్కులు, బస్సులు వంటి ప్రభుత్వ ఆస్తులను సంరక్షించుకోవడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయాలని, ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు ఈ విలువలను బోధించి పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. హైకోర్టు అడ్వకేట్ చీర్ల లాలాచంద్ మాట్లాడుతూ, దేశ ఐక్యత మరియు సమగ్రతను కాపాడేందుకు కుల, మత, వర్ణ, ప్రాంతీయ, భాషా, లింగ భేదాలకు అతీతంగా ఆర్టికల్ 14 మరియు 15 ప్రకారం పిల్లలందరికీ సమానత్వపు హక్కు ఉందని స్పష్టం చేశారు. ఆర్టికల్ 21-ఎ ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను పొందే హక్కు ఉందని, అలాగే ఆర్టికల్ 24 ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలను ప్రమాదకర పరిశ్రమల్లో పనులకు నియమించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలకు విద్యావకాశాలు కల్పించడాన్ని ప్రాథమిక విధిగా భావించాలని, పిల్లలు కూడా చదువు, క్రీడలు మరియు ఇతర రంగాలలో రాణిస్తూ వ్యక్తిగత, సామూహిక ఉన్నతి ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ **(NCPCR)** పనిచేస్తోందని, ఎక్కడైనా పిల్లల హక్కులకు భంగం కలిగితే తక్షణమే 1098 (చైల్డ్ లైన్) నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డీసీపీ యూనిట్ నుండి పివోఐసి బి. విజయ్ కుమార్, పివోఎన్ఐసి టి. దుర్గా భవాని, చైల్డ్ లైన్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఏ. సాయి కృష్ణ, తుళ్లూరు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీనివాసరావు, తుళ్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివపార్వతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీ సతీష్ పాల్గొన్నారు. వీరితో పాటు ఐసిడిఎస్ సూపర్వైజర్లు శ్రీలత, సీతారావమ్మ, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిబ్బంది పెద్దిపాగ అనిల్ కుమార్, నేలటూరి నాగమణి, ఎ. పోతురాజు, బి. విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు మరియు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజాస్వామ్య బలోపేతంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకం





అనంతపురం నవంబర్ 20 : ప్రజాస్వామ్య బలోపేతంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలనే అవగాహన కలిగి ఉండాలని అనంతపురం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఏర్పాటు ఆవశ్యకత, ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై విస్తృత అవగాహన కల్పించేందుకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రశంసా పత్రాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా క్విజ్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందికి, వ్యాస రచన పోటీలలో గెలుపొందిన 10 మంది విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ?అంతకుముందు జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల స్థాయిలో ఓటరు నమోదు, ఓటింగ్ ప్రాముఖ్యతపై పోటీలు నిర్వహించి, వాటిలో ప్రతిభ కనబరిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో పోటీలు పెట్టారు. అక్కడ ఎంపికైన 83 మంది విద్యార్థులకు స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జిల్లా స్థాయి క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ?ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ, పాఠశాల మరియు కళాశాల స్థాయి నుండే విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం 8వ తరగతి నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులలో 18 ఏళ్లు నిండిన వారు ఇప్పటికే ఓటర్లుగా నమోదయ్యారని, మిగిలిన వారు రాబోయే మూడు నుండి ఐదు సంవత్సరాలలో ఓటు హక్కు పొందనున్నారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కచ్చితంగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎటువంటి డబ్బులు, ప్రలోభాలు లేదా ద్వేషాలకు లోనుకాకుండా, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగల సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని ఆకాంక్షించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులంతా ఓటు హక్కు ఆవశ్యకతను తమ తోటి స్నేహితులకు, సమాజానికి తెలియజేసే బాధ్యత తీసుకోవాలని, మరింత మంది కొత్త విద్యార్థులు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్‌లో నమోదు కావాలని కలెక్టర్ కోరారు. అనంతరం పలువురు విద్యార్థులు కలెక్టర్‌తో తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మలోలా, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనక రాజ్, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్యుల్, వివిధ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో భగ్గుమన్న రాజకీయ కక్షలు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై దాడి

10 స్కార్పియో వాహనాలు ధ్వంసం!



(తెలుగు కలం) (నవంబర్ 20) : తాడిపత్రి (అనంతపురం జిల్లా): స్థానిక సంస్థల ఎన్నికల వేళ అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసంపై తెలుగుదేశం పార్టీ (జేసీ వర్గీయులు) నేతలు మరియు కార్యకర్తలు భారీ స్థాయిలో రాళ్ల దాడికి పాల్పడ్డారు. సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల వ్యవహారంపై ఇగదూరు, సజ్జలదిన్నె గ్రామాల్లో మొదలైన వివాదం చినికి చినికి గాలివానగా మారి, తాడిపత్రి పట్టణంలో రణరంగాన్ని సృష్టించింది. దాడి జరిగిన సమయంలో పెద్దారెడ్డి ఇంట్లో లేకపోవడంతో, ఆగ్రహంతో ఊగిపోయిన ఆందోళనకారులు ఇంటి లోపలికి చొరబడి అద్దాలు, ఫర్నీచర్ మరియు సీసీ కెమెరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా ఇంటి ఆవరణలో, బయట నిలిపి ఉంచిన పెద్దారెడ్డి మరియు ఆయన అనుచరులకు చెందిన 10 స్కార్పియో వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు, దాదాపు 20 ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో వాహనాలన్నీ మంటల్లో కాలి బూడిదవడంతో భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దాడులు, దహనకాండను అత్యంత తీవ్రంగా పరిగణించిన పోలీసు యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఘటనకు బాధ్యులైన వారిపై హత్యాయత్నం కింద ఐపీసీ సెక్షన్ 307 సహా పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దాడులకు పాల్పడిన నిందితులందరినీ గుర్తించి, వారందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు పూర్తి స్థాయిలో రంగం సిద్ధం చేశారు. ?పోలీసుల కఠిన చర్యల నేపథ్యంలో తాడిపత్రి నియోజకవర్గంలోని నిందితుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తమను ఎప్పుడు అరెస్టు చేస్తారోనన్న తీవ్ర భయాందోళనలతో నిందితులు తమ ఇళ్లను, ఊళ్లను ఖాళీ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపు చర్యలు (వేట) ప్రారంభించారు. మరోవైపు, తాడిపత్రి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించి పహారా కాస్తున్నారు.

కర్నూలులో నిఖిల్ సాయి మెమోరియల్ హాకీ టోర్నమెంట్

23న ఎస్టీబీసీ మైదానంలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు



కర్నూలు, (తెలుగు కలం) (నవంబర్ 20) : పాఠశాల స్థాయి నుంచే హాకీ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించే లక్ష్యంతో కర్నూలులో నిఖిల్ సాయి మెమోరియల్ స్కూల్ లెవెల్ 11-ఆ-సైడ్ హాకీ టోర్నమెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కర్నూలు జిల్లా హాకీ అడ్హాక్ కమిటీ సహకారంతో రైజింగ్ స్టార్స్ హాకీ క్లబ్ (రిజిస్టర్డ్), అక్సా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న కర్నూలులోని ఎస్టీబీసీ హాకీ మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో బాలురు, బాలికలకు ప్రత్యేక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. 11-ఆ-సైడ్ విధానంలో జరిగే ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో క్రీడా ఆసక్తిని పెంచడంతో పాటు, భవిష్యత్తులో ఉన్నత స్థాయి పోటీల్లో రాణించే క్రీడాకారులను గుర్తించవచ్చని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని హాకీపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి బాలురు, బాలికల జట్లను పోటీలకు సిద్ధం చేయాలని కోరారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే క్రీడల్లో తగిన అవకాశాలు కల్పిస్తే మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. కావున ఆసక్తి గల పాఠశాలల యాజమాన్యాలు తమ జట్ల పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు రైజింగ్ స్టార్స్ హాకీ క్లబ్ అధ్యక్షుడు మదాసి కురువ భరత్ కుమార్‌ను 97040 36703 నంబర్‌లో సంప్రదించాలని పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ.. మహిళల సొమ్ముపై కన్ను...!

పొదుపు సంఘాలపై ఆర్పీల వసూళ్ల దందా?

లక్ష లోన్‌కు రూ.2 వేలు.. రెండు లక్షల లోన్‌కు రూ.5 వేలు

సంతకానికి ఒక రేటు.. ఆన్‌లైన్‌కు మరో రేటు.. బ్యాంకు పనులకూ వసూళ్లే...!


గుంతకల్లు నవంబర్ 20 తెలుగుకలం :- మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి మహిళలకు ఆర్థిక చేయూత అందిస్తుంటే, కొందరు ఆర్పీలు మాత్రం అదే మహిళల నుంచి అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు గుంతకల్లు పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మహిళలకు అండగా నిలవాల్సిన వారే వారి ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొదుపు సంఘంలో రుణం పొందాలంటే ఆర్పీల చేతులు తడపాల్సిందేనని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష రుణానికి రూ.2 వేలు.. రెండు లక్షల రుణానికి రూ.5 వేలు :-

పొదుపు సంఘాల మహిళలకు రుణాలు మంజూరయ్యే సమయంలో కొందరు ఆర్పీలు, గ్రూపు లీడర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. లక్ష రూపాయల రుణం మంజూరైతే ఒక్కొక్కరి నుంచి రూ.2,000 చొప్పున, రెండు లక్షల రూపాయల రుణం మంజూరైతే ఒక్కొక్కరి నుంచి రూ.5,000 చొప్పున వసూలు చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. రుణం తీసుకుని కుటుంబ అవసరాలు తీర్చుకోవాలనుకునే మహిళలకు ముందుగానే ముడుపుల భారం పడుతోందని వాపోతున్నారు. ప్రభుత్వం మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు రుణాలు మంజూరు చేస్తుంటే మధ్యలో ఈ వసూళ్ల పర్వం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అసలు ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయి? ఎవరి అనుమతితో వసూలు చేస్తున్నారు? వీటికి అధికారిక రసీదులు ఇస్తున్నారా? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

సంతకానికి ఒక రేటు.. ఆన్‌లైన్‌కు మరో రేటు :-

మున్సిపాలిటీ కార్యాలయంలో సంతకాలు చేయించుకోవడానికి ఒక రేటు, ఆన్‌లైన్ ఎంట్రీలకు మరో రేటు, థంబ్ వేయించడానికి ఇంకో రేటు అంటూ ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. అడిగినంత డబ్బులు చెల్లిస్తే పనులు



పొదుపు మహిళల నుండి ఆర్.పి ద్వారా మున్సిపల్ అధికారికి డబ్బులు ఏ విధంగా చేరుతున్నాయో

త్వరగా పూర్తవుతున్నాయని, ప్రశ్నిస్తే మాత్రం రుణం మంజూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

బ్యాంకు పనులకూ మహిళల జేబులకే చిల్లు :-

బ్యాంకు పనుల నిమిత్తం వెళ్లినప్పుడు ఒక్కొక్కరి నుంచి రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్పీలు, గ్రూపు లీడర్లు బ్యాంకులకు వెళ్లేందుకు ఉపయోగించే ఆటో చార్జీలను సైతం సంఘాల మహిళల నుంచే వసూలు చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఒక గ్రూపునకు రుణం మంజూరు కావాలంటే మున్సిపాలిటీ నుంచి బ్యాంకుల వరకు పలుమార్లు తిరగాల్సి వస్తోందని, ప్రతి దశలోనూ ఏదో ఒక పేరుతో డబ్బులు అడుగుతున్నారని ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం ఇచ్చే జీతం సరిపోవడం లేదా? :-

గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ **(SERP)** పరిధిలో పనిచేసే వీవోఏలు, ఆర్పీలకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం అందుతోంది. ఇందులో రూ.8,000 రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుండగా, మిగిలిన రూ.2,000 గ్రామ సమాఖ్య నిధుల నుంచి సమకూరుతోంది. పట్టణ ప్రాంతాల్లో మెప్మా **(MEPMA)** పరిధిలో పనిచేసే ఆర్పీలకు కూడా నెలకు రూ.10,000 వరకు గౌరవ వేతనం నిర్ణయించారు. కొన్ని ప్రాంతాల్లో రూ.7,000 ప్రభుత్వం నుంచి, మిగిలిన మొత్తం స్లమ్ లెవల్ ఫెడరేషన్ **(SLF)** ద్వారా చెల్లించే విధానం అమల్లో ఉంది. ఈ పెంచిన గౌరవ వేతనాలు 2019 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి.ప్రభుత్వం ప్రజాధనంతో నెలనెలా గౌరవ వేతనాలు చెల్లిస్తున్నా, మహిళలకు అందించాల్సిన సేవలకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రావడం విచారకరం. ప్రభుత్వ జీతం ఒకవైపు.. మహిళల సొమ్ముపై మరోవైపు కన్ను వేయడం ఎంతవరకు సమంజసమని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

రుణమాఫీ ప్రయోజనాలకూ అడ్డంకులా? :-

మహిళా సంఘాలకు ప్రభుత్వం అందించే రుణాలు, రుణమాఫీ ప్రయోజనాలు అర్హులైన సభ్యులకు సక్రమంగా చేరాల్సి ఉంది. అయితే కొందరు ఆర్పీలు, గ్రూపు లీడర్ల జోక్యంతో మహిళలకు అనవసర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణం కావాలన్నా, రుణమాఫీ ప్రయోజనం పొందాలన్నా తమ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని మహిళలు వాపోతున్నారు.

జిల్లా కలెక్టర్ స్పందించాలి.. వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి :-

గుంతకల్లు పట్టణంలోని పొదుపు సంఘాల మహిళలు చేస్తున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్, మెప్మా పీడీ, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించాలి. లక్ష రుణానికి రూ.2,000, రెండు లక్షల రుణానికి రూ.5,000 వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ప్రత్యేకంగా విచారణ చేపట్టాలి. మున్సిపల్ సంతకాలు, ఆన్‌లైన్ ఎంట్రీలు, బ్యాంకు పనులు, ఆటో చార్జీల పేరుతో జరుగుతున్న వసూళ్లపై సమగ్ర పరిశీలన చేయాలి. బాధిత మహిళల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.మహిళల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన పొదుపు సంఘాలు కొందరి వ్యక్తిగత సంపాదనకు వేదికలు కాకూడదు. ప్రభుత్వ గౌరవ వేతనం తీసుకుంటూ మహిళల నుంచే అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలకు అధికారులు సమాధానం చెప్పాలి. మహిళలకు అందాల్సిన రుణాల కోసం ముడుపులు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటే మహిళా సాధికారతకు అర్థం ఏమిటి? ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఈ వసూళ్ల వ్యవహారానికి అడ్డుకట్ట వేస్తారా? లేక మహిళల ఆవేదనను గాలికి వదిలేస్తారా?

నూతన ప్రజాప్రతినిధులు ప్రజాసేవకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి

పెద్దవడుగూరు నవంబర్ 20 తెలుగుకలం : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలు తమ ఓటు ద్వారా అప్పగించిన బాధ్యతను గుర్తించి నూతన ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించాలని పెద్దవడుగూరు మండల నాయకుడు చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. పదవులు అనేవి హోదా కోసం కాకుండా ప్రజలకు సేవ చేయడానికి లభించిన అవకాశాలుగా ప్రతి ఒక్కరూ భావించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని వాటిని నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని కోరారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లడం కాకుండా, పదవుల్లో ఉన్నంతకాలం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా నిలవాలని హితవు పలికారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని దివాకర్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలు, రహదారుల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీ



కాలువలు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని అన్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా గౌరవంగా పలకరించాలని, సమస్య చిన్నదైనా పెద్దదైనా దాని పరిష్కారానికి తక్షణమే చొరవ చూపాలని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని, గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, మహిళలకు సంక్షేమ పథకాలు, రైతులకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో మహిళలు, యువత, రైతులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ సమానంగా చూడాలని, ఎన్నికల సమయంలో ఉన్న రాజకీయ విభేదాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. ప్రజాప్రతినిధుల పనితీరు మాటల్లో కాకుండా ప్రజలకు అందించే సేవల్లో, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో కనిపించాలని, పెద్దవడుగూరు మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నూతన ప్రజాప్రతినిధులందరూ సమష్టిగా కృషి చేయాలని చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి ఆకాంక్షించారు.

జనగణన రెండో దశకు పక్కా ప్రణాళిక

అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దిశానిర్దేశం

పుట్టపర్తి నవంబర్ 20 తెలుగుకలం : జిల్లాలో జరగనున్న జనగణన (సెన్సస్) రెండో దశ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు శుక్రవారం పుట్టపర్తి సాంస్కృతి కళాశాలలో ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమక్షంలో, జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, దేశ ప్రగతికి మరియు భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు జనగణన గణాంకాలు ఎంతో కీలకమని తెలిపారు. క్షేత్రస్థాయి విధుల నిర్వహణలో ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు మరియు టెక్నికల్ అసిస్టెంట్ల పాత్ర వెన్నెముక వంటిదని ఆయన పేర్కొన్నారు. నేడు శిక్షణ పొందిన అధికారులు, సిబ్బంది తదుపరి దశలో క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా విధులు నిర్వహించే సూపర్‌వైజర్లు మరియు ఎన్యూమరేటర్లకు నాణ్యమైన శిక్షణను అందిస్తారని చెప్పారు. జనగణన ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ మార్గదర్శకాలు మరియు విధివిధానాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జనగణన రెండో దశ షెడ్యూల్ వివరాలను అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా



స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) జనవరి 10 నుండి జనవరి 24 వరకు 15 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ సమయంలో ప్రజలు డిజిటల్ మాధ్యమాల ద్వారా స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించబడింది. అనంతరం క్షేత్రస్థాయి జనగణన (ఫీల్డ్ ఎన్యూమరేషన్) జనవరి 25 నుండి ఫిబ్రవరి 28 వరకు మొత్తం 35 రోజుల పాటు ఇంటింటి సర్వే రూపంలో జరుగుతుంది. ఈ కాలంలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలను సేకరిస్తారు. ఆ తర్వాత పునఃపరిశీలన (రివిజనల్ రౌండ్) మార్చి 1 నుండి మార్చి 5 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించబడుతుంది.




నమోదు కాకుండా మిగిలిపోయిన వారు ఉన్నా, లేదా వివరాలలో మార్పులు చేర్పులు ఉన్నా ఈ దశలో సరిచేస్తారు. ?జనగణన ప్రక్రియలో భాగంగా నియమించబడిన ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణ అనంతరం ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చి ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరిస్తారని, సూపర్‌వైజర్లు ఈ మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ తగు సూచనలు అందిస్తారని అధికారులు తెలిపారు. ?జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి కుటుంబానికి సంబంధించిన ఖచ్చితమైన మరియు వాస్తవ సమాచారాన్ని సేకరించడం ద్వారా అత్యంత విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించవచ్చని పేర్కొన్నారు. ఈ జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించి పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి సెప్టెంబర్ 20 తెలుగుకలం : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా



సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వేడుకలకు రాష్ట్రం, పొరుగు నగరాలతో పాటు దేశ, విదేశాల నుండి ప్రముఖులు, భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు

సమన్వయంతో, సమిష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల సందర్భంగా రోజువారీ భక్తుల రాకపోకలను ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా రవాణా, వసతి సౌకర్యాలను ముమ్మరంగా కల్పించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ కోసం ఇంటర్నల్ రింగ్ రోడ్ల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ముఖ్య ప్రదేశాల్లో పటిష్టమైన భద్రత, నిరంతర పహారా ఉండేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా సురక్షిత తాగునీటి కోసం వాటర్ పాయింట్లు, మొబైల్ టాయిలెట్లు, వీధి దీపాలు, డ్రైనేజ్ వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వ్యర్థాల నిర్వహణ కోసం తగినన్ని డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఫుడ్ కౌంటర్లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ. 3.5 లక్షల విలువైన సెంట్రింగ్ షీట్ల దొంగల అరెస్ట్



కర్నూలు (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : కర్నూలు పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంటి నుంచి సుమారు రూ. 3.5 లక్షల విలువైన సెంట్రింగ్ షీట్లను దొంగిలించిన ఐదుగురు యువకులను 4వ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక బిల్డర్ మోహన్ వీకర్ సెక్షన్ కాలనీలో నిర్మిస్తున్న ఇంటి స్లాబ్ పనుల కోసం ఉంచిన సుమారు 320 సెంట్రింగ్ షీట్లు గత వారం చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఘటనా స్థలం పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించగా, ముగ్గురు యువకులు ఒక ఎలక్ట్రిక్ ఆటోలో ఈ షీట్లను తరలిస్తున్నట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుల కదలికలను ట్రాక్ చేసిన పోలీసులు, ఈ చోరీకి పాల్పడిన ఎన్టీఆర్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ (21), రఫీ (27), పఠాన్ రిహాన్ అలీ ఖాన్ (19), షేక్ షాహిద్ (20) లతో పాటు సంతోష్ నగర్‌కు చెందిన కాజా (28) లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరంతా తమ జల్సాలకు డబ్బుల కోసం ఈ సెంట్రింగ్ షీట్లను దొంగిలించి, కోడుమూరు రోడ్డులోని గుజిరీ షాపుల్లో విక్రయించినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి చోరీకి గురైన మొత్తం సెంట్రింగ్ షీట్లను, దొంగతనానికి ఉపయోగించిన ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరిపై సస్పెక్ట్ షీట్లు తెరిచి వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచనున్నట్లు 4వ పట్టణ సీఐ విక్రమసింహ ఒక ప్రకటనలో తెలిపారు.

ఐదుకల్లులో ఊపందుకున్న వైసీపీ ఎన్నికల ప్రచారం..

బోయ కమలమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీ తలారి రంగయ్య పిలుపు



శెట్టూరు (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : అనంతపురం జిల్లా శెట్టూరు మండలంలోని ఐదుకల్లు గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కళ్యాణదుర్గం మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఐదుకల్లు గ్రామంలో పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ?గ్రామానికి విచ్చేసిన మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్యకు స్థానిక వైసీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ తలారి రంగయ్య మాట్లాడుతూ, రానున్న పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన ఐదుకల్లు సర్పంచ్ అభ్యర్థి బోయ కమలమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధి జరగాలంటే వైసీపీ బలపరిచిన అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు. తలారి రంగయ్య పర్యటనతో ఐదుకల్లు గ్రామంలో వైసీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

'సంజీవని' అమలుకు పుట్టపర్తిలో ప్రత్యేక శిక్షణ

సిబ్బందికి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దిశానిర్దేశం



పుట్టపర్తి నవంబర్ 20 తెలుగుకలం : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. ఫైరోజా బేగం వర్యవేక్షణలో వైద్యాధికారులు మరియు సంజీవని మిత్రులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పుట్టపర్తిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రాంగణంలో నవంబర్ 20 నుండి 28 వరకు తొమ్మిది రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. **TATA** వీణ సంస్థ సాంకేతిక సహకారం మరియు సమన్వయంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో, ఆ సంస్థకు చెందిన నివుణులైన ట్రైనర్లు చరణ్ మరియు ప్రసాద్ శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా రోగుల వివరాల నమోదు, డిజిటల్ హెల్త్ రికార్డుల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే విధానంపై క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ప్రజలకు సకాలంలో, మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు మరియు సంజీవని మిత్రుల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ స్వయంగా సందర్శించారు. శిక్షణ పొందుతున్న వైద్యాధికారులు, సంజీవని మిత్రులతో ఆయన ముఖాముఖి మాట్లాడి, శిక్షణ జరుగుతున్న తీరును, వారికి అందిస్తున్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంజీవని కార్యక్రమాన్ని జిల్లాలో నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది అంతా పూర్తి అంకితభావంతో, సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంజీవని కార్యక్రమ నోడల్ అధికారి డా. జె. పద్మజ, **DPO-NHM** ఇన్‌చార్జ్, **TATA** వీణ బృందం ప్రతినిధులు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంజీవని మిత్రులు మరియు ఇతర వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి పంచాయతీ సర్పంచ్‌గా పుచ్చకాయల రాధ ఏకగ్రీవ ఎన్నిక



శింగనమల (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : శింగనమల మండల పరిధిలోని పెరవలి గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా పుచ్చకాయల రాధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పెద్దలు మరియు గ్రామస్తుల సమష్టి నిర్ణయంతో ఆమెను సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా సర్పంచ్ పదవికి పి. రాధ తరఫున కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. కేవలం సర్పంచ్ పదవి మాత్రమే కాకుండా, పంచాయతీ పరిధిలోని వార్డు సభ్యులందరినీ కూడా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తమపై పూర్తి నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ పెద్దలకు, ప్రజలందరికీ నూతన సర్పంచ్ పుచ్చకాయల రాధ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల ఆకాంక్షలకు అనుగుణంగా పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలి సిఐటియు డిమాండ్

విజయవాడ (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి స్కీం వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనంగా రూ. 42 వేలు చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని మరియు విపరీతమైన పని భారాన్ని తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక శాంతినగర్ ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేస్తూ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ సిటీ సిఐటియు ప్రధాన కార్యదర్శి కె. దుర్గారావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబర్ 1, 2, 3 తేదీలలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' మహాధర్నా కార్యక్రమంలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ఇస్తున్న రాయితీలను తక్షణమే విరమించుకుని, అహర్నిశలు కష్టపడి పనిచేసే శ్రామికులకు న్యాయమైన కనీస వేతనాలు అమలు చేయాలని దుర్గారావు కోరారు. ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించా

పోలీసులమని చెప్పి వ్యాపారి వద్ద రూ.10 వేల దోపిడీ

పుట్లూరు (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలో నకిలీ పోలీసులుగా చెప్పుకుంటూ ఓ వ్యాపారిని బెదిరించి రూ.10 వేల నగదు దోచుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని శనగలగూడూరు వద్ద రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న వ్యాపారి నాగేంద్రను ఇద్దరు వ్యక్తులు అడ్డగించారు. తాము పోలీసులమని పరిచయం చేసుకుని బైక్ నిలిపి, తనిఖీల పేరుతో ఆయన వద్ద ఉన్న రూ.10 వేల నగదును తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. ఆ తర్వాత నాగేంద్ర అదే గ్రామంలో ఎన్నికల విధుల్లో ఉన్న అసలైన పోలీసుల వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని వివరించారు. నగదు తీసుకున్న వారు పోలీసులు కాదని, నకిలీ వ్యక్తులని అసలు పోలీసులు స్పష్టం చేయడంతో బాధితుడు వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, నకిలీ వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

డోన్ పట్టణంలో నేడు నాలుగు

గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

డోన్ నవంబర్ 20 తెలుగుకలం : నంద్యాల జిల్లా డోన్ పట్టణ ప్రజలకు ముఖ్య గమనిక. పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చేపట్టనున్న అత్యవసర మరమ్మతులు మరియు నిర్వహణ పనుల కారణంగా శనివారం (నవంబర్ 21) నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పట్టణ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) మురళీకృష్ణ ఒక ప్రకటనలో వెల్లడించారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.



వృద్ధాశ్రమంలో విద్యార్థుల సాంస్కృతిక


సందడి వృద్ధుల్లో కొత్త ఉత్సాహం

అనంతపురం నవంబర్ 20 తెలుగుకలం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతపురంలోని రాకేష్ వృద్ధాశ్రమంలో పాతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్-2 విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.



వయోవృద్ధుల్లో ఒంటరితనాన్ని దూరం చేసి, వారిలో ఆనందం, ఆత్మవిశ్వాసం నింపడంతో పాటు విద్యార్థుల్లో పెద్దల పట్ల గౌరవం, ప్రేమ, బాధ్యతాభావం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ?ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక మరియు వినోద కార్యక్రమాలు వృద్ధులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రదర్శనలతో వృద్ధులు సైతం ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకుని ఆనందంగా గడిపారు. ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించడం వల్ల ఒంటరితనం తగ్గి మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, జీవితాల్లో కొత్త ఉత్సాహం కలుగుతుందని పలువురు వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. ?సమాజానికి వయోవృద్ధులు అందించిన సేవలను గుర్తిస్తూ, వారితో యువత మరియు విద్యార్థులు ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందించుకోవడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ వృద్ధాశ్రమాల్లో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ అనిల్, సీనియర్ సహాయకులు విజయలక్ష్మి, పాతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్-2 విద్యార్థులు, ఉపాధ్యాయులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు మరియు అనంతపురం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు



ఇబ్రహీంపట్నం (తెలుగు కలం) (నవంబర్ 20) : ప్రతినిధి : ఇబ్రహీంపట్నంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ పుష్పలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేసి ఆమె అభినందించారు. విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి. రమేష్ పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి

పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ పూర్తి


అనంతపురం నవంబర్ 20 తెలుగుకలం : జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్, ఐ.ఏ.ఎస్ వెల్లడించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి హాలులో గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికలు – 2026కు సంబంధించి పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు 2,865 మంది, ఓపిఓలు 2,865 మంది, ఓపిఓ1లు 1,734 మంది, మరియు ఓపిఓ2లు 232 మంది చొప్పున పోలింగ్ సిబ్బందిని కేటాయించి ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. కేటాయించిన సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, డిఆర్ఓ మలోల, ఎన్ఐసి డిఐఓ భారతి, మరియు ఎన్ఐసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దేవనబండ పంచాయతీ పీఠంపై వైఎస్ఆర్సీపి గురి!

సర్పంచ్ ఎన్నికకు సై అంటున్న దశరథ రాముడు!

22న నామినేషన్.. తరలిరావాలని నేతల పిలుపు



పత్తికొండ, నవంబర్ 20 తెలుగు కలం: దేవనబండ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ సందడి మొదలైంది.సర్పంచ్ పదవికి వైఎస్ఆర్సీపి బలపరిచిన అభ్యర్థిగా మిద్దింటి దశరథ రాముడు బరిలో నిలుస్తున్నారు.ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయంలో ఆయన నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ఆశీస్సులతో, దేవనబండ మాజీ సర్పంచ్ పి.ప్రవీణ రెడ్డి,వైఎస్ఆర్సీపి సీనియర్ నాయకుడు పి. గాంధీ రెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అండగా నిలవాలని నేతలు పిలుపునిచ్చారు. నామినేషన్ కార్యక్రమాన్ని పార్టీ బలప్రదర్శనగా కాకుండా ఐక్యతకు నిదర్శనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. గ్రామ ప్రజలు,మిత్రులు, శ్రేయోభిలాషులు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవనబండ మాజీ సర్పంచ్ పి.ప్రవీణ రెడ్డి,వైఎస్ఆర్సీపి సీనియర్ నాయకుడు పి. గాంధీ రెడ్డి ఆహ్వానించారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు దేవనబండ గ్రామ సచివాలయంలో జరిగే నామినేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

బియ్యం ధరలకు కళ్లెం.. ధరణి విక్రయ కేంద్రాల విస్తరణ

నిబంధనలు ఉల్లంఘించిన 46 మంది వ్యాపారులపై కేసులు..

రూ. 5.15 లక్షల జరిమానా

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రతినిధి : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో బియ్యం ధరలను అదుపులోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా సంయుక్త కలెక్టర్ వెల్లడించారు. సామాన్య వినియోగదారులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యాన్ని అందించే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా 'ధరణి రైస్ విక్రయ కేంద్రాలను' విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం ధ్రీ-3291 (సోనా), **BPT**-5204 (సాంబా), **KNM** రకాల బియ్యం కిలో రూ.66, **H**మీ మరియు **RNR** రకాలు కిలో రూ.76, జై శ్రీరామ్ రకం రూ.82, అలాగే మీఖ సాధారణ రకాల బియ్యం కిలో రూ.47 చొప్పున విక్రయించాలని ఆయన స్పష్టం చేశారు. వ్యాపారులందరూ ప్రభుత్వం నిర్దేశించిన ఈ ధరలకే బియ్యాన్ని విక్రయించాలని, ప్యాకింగ్ సంచులపై సరైన గరిష్ట చిల్లర ధర **(MRP)** ముద్రించడంతో పాటు ప్రతి దుకాణం వద్ద ధరల పట్టిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సంయుక్త కలెక్టర్ ఆదేశించారు. వ్యాపారుల వద్ద ఉన్న పాత స్టాక్‌కు కూడా ప్రస్తుతం నిర్ణయించిన ధరలే వర్తిస్తాయని ఆయన స్పష్టం చేశారు.



అంతేకాకుండా, జిల్లాలోని రైస్ మిల్లర్లు, ప్రాసెసర్లు, హోల్‌సేల్ మరియు రిటైల్ వ్యాపారులందరూ తమ వద్ద ఉన్న బియ్యం, వరి నిల్వల వివరాలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ 'ఫుడ్ స్టాక్ పోర్టల్' **(http://foodstock.dfpd.gov.in)** లో నమోదు చేయాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించే వ్యాపారస్తులపై సంబంధిత శాఖల ద్వారా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బియ్యం నిల్వ పరిమితుల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని సంయుక్త కలెక్టర్ వివరించారు. ఈ నిబంధనల ప్రకారం ట్రేడింగ్ రైస్ మిల్లులు **(CMR** మరియు ప్రభుత్వ నిల్వలు మినహా) 4,000 క్వింటాళ్లు లేదా ఏడు రోజుల మిల్లింగ్ సామర్థ్యంలో ఏది ఎక్కువైతే అంత పరిమాణం వరకు మాత్రమే నిల్వ ఉంచుకోవచ్చు. హోల్‌సేల్ వ్యాపారులు కార్పొరేషన్ పరిధిలో 1,000 క్వింటాళ్లు, జిల్లా కేంద్రంలో 500 క్వింటాళ్లు, ఇతర ప్రాంతాలలో 250 క్వింటాళ్ల వరకు మాత్రమే స్టాక్ కలిగి ఉండాలి. అదేవిధంగా రిటైల్ వ్యాపారులకు పట్టణ ప్రాంతాలలో 100 క్వింటాళ్లు, గ్రామీణ ప్రాంతాలలో 50 క్వింటాళ్ల గరిష్ట నిల్వ పరిమితిని విధించారు. ప్రతి వ్యాపారి మరియు రైస్ మిల్లర్ తమకు నిర్దేశించిన పరిమితులకు లోబడి మాత్రమే నిల్వలు ఉంచుకోవాలని, పరిమితికి మించి నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు తమ పరిధిలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ మరియు రిటైల్ వ్యాపారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, నిర్ణీత ధరల అమలుపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సంయుక్త కలెక్టర్ సూచించారు. కాగా, నిబంధనల అమలులో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు పౌర సరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా 75 తనిఖీలు నిర్వహించారని, ఉల్లంఘనలకు పాల్పడిన వ్యాపారులపై 46 కేసులు నమోదు చేసి రూ. 5,15,000 జరిమానా విధించినట్లు అధికారులు ఈ సమావేశంలో వెల్లడించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి ఎంపీ, ఎమ్మెల్యే పిలుపు

అనంతపురంలో ఘనంగా ముగిసిన 59వ

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రతినిధి : విజ్ఞానానికి, వికాసానికి నిలయాలుగా నిలుస్తూ ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు దోహదపడుతున్న గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్‌లతో పాటు సమాజ సేవకులు, రవికాంత్ క్యాటరింగ్ అధినేత కె.వి. రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, గ్రంథాలయాలు నేటి ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు. విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే అనేక పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని, పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా ఉన్నత చదువులు, క్రమశిక్షణ, జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ మాట్లాడుతూ, త్వరలోనే అనంతపురం నగరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఒక స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ స్టడీ సెంటర్‌లో సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2, బ్యాంకు, రైల్వే, డీఎస్సీ వంటి అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నోటిఫికేషన్లకు సంబంధించిన మెటీరియల్‌ను కూడా అందుబాటులో ఉంచుతామని, అభ్యర్థులు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్ మాట్లాడుతూ, అన్ని వర్గాలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, అందరూ గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. అనంతరం ముఖ్య అతిథులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్యదర్శి శాలువా కప్పి మెమెంటో బహుకరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళా భూషణ్ అంకె రామలింగయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీరాములు, డిప్యూటీ గ్రంథాలయాధికారి పి. కమ్మన్న, సహాయ గ్రంథాలయాధికారి డి. గోవిందు, కార్యాలయ సిబ్బంది రామాంజినమ్మ, కిరణ్, జీవన, ముత్యాలమ్మ, ఇందిరమ్మ, శిరీషా, శ్రీవిజయ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో భారీగా లిక్విడ్ గంజాయి స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్

కాకినాడ (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రతినిధి : గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచిన కాకినాడ జిల్లా పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.62.50 లక్షల విలువైన ఐదు కిలోల లిక్విడ్ గంజాయి (హషీష్ ఆయిల్)తో పాటు రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మొత్తం సొత్తు విలువ సుమారు రూ.67.80 లక్షలు ఉంటుందని జిల్లా పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ?గండేపల్లి మండలం జెడ్. రాగంపేట గ్రామ సమీపంలోని జాతీయ రహదారి-16పై గురువారం ఉదయం 8 గంటల సమయంలో పోలీసులు సాధారణ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముఠా పట్టుబడింది. రహదారి పక్కన ఉన్న టీ బ్రీ షాపు ఎదురుగా నిలిపి ఉంచిన రెండు కార్లలో నిందితులు గంజాయిని మార్పిడి చేసుకుంటుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో విశాఖపట్నానికి చెందిన కోరుపల్లి రవితేజ (34), మలిరెడ్డి సాయి రాఘవ (32),



కాకినాడ జిల్లాకు చెందిన నాయిన రాజశేఖర్ (32)లతో పాటు కేరళ రాష్ట్రానికి చెందిన వివేక్ వడక్కెకున్నిమ్మెల్ (32), ఆకాష్ చెరియన్ (31) ఉన్నారు. ?పోలీసుల విచారణలో నిందితుల అక్రమ రవాణా తీరు వెలుగులోకి వచ్చింది. ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుంచి ఈ ఐదు కిలోల లిక్విడ్ గంజాయిని రూ.5 లక్షలకు కొనుగోలు చేసిన నిందితులు, దానిని రాజమండ్రి మీదుగా తరలించి కేరళకు చెందిన వ్యక్తులకు రూ.5.10 లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. సరిగ్గా సరుకును అప్పగిస్తున్న సమయంలోనే పోలీసులు దాడి చేసి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ ఏ.బి.జి. తిలక్ పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ బి. తిరుపతిరావు, గండేపల్లి ఎస్ఐ యు.వి. శివ నాగబాబు మరియు ఈగల్ బృందం సంయుక్తంగా ఈ దాడిలో పాల్గొన్నాయి. చాకచక్యంగా వ్యవహరించి ముఠాను పట్టుకున్న పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమాజానికి పెనుముప్పుగా మారిన గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే ఈగల్ టోల్-ఫ్రీ నంబర్ 19725కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్పీ బిందు మాధవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సమాజంలో మార్పు తెచ్చేలా సత్యసాయి సేవాదళ్ సేవలు


పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రతినిధి : సత్యసాయి సేవాదళ్ ప్రతి సభ్యుడు సమాజంలో సానుకూల మార్పు తీసుకొచ్చే వెలుగుగా నిలవాలని సత్యసాయి జాతీయ సేవా సంస్థల అధ్యక్షుడు నిమిష్ పాండే పిలుపునిచ్చారు. పుట్టపర్తిలో జరుగుతున్న శ్రీ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి సేవాదళ్ మహా సమ్మేళనం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ట్రస్టు ప్రతినిధులు, సేవాదళ్ సభ్యుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్. రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి ఎన్ఎస్. నాగానంద, నిమిష్ పాండే పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమ్మేళనంలో వక్తలు మాట్లాడుతూ, సాధారణ స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలంటే ప్రేమ, సేవ, దైవత్వం అనే మూడు అంశాలు పరస్పరం ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. ఈ



మహా సమ్మేళనం కేవలం ఒక సంస్థాగత కార్యక్రమం మాత్రమే కాదని, సత్యసాయి బోధనలను నిత్యం స్మరించుకుంటూ వ్యక్తిగతంగా మార్పు చెంది, సేవాదళ్ ద్వారా సమాజానికి నిరంతరం సేవలు అందించాలని సూచించారు. "మానవసేవయే మాధవసేవ" అనే సత్యసాయి సందేశాన్ని ఆచరణలో చూపించాలని పిలుపునిచ్చారు. ?సేవా కార్యక్రమం ఎప్పుడూ ఇంటి నుంచే ప్రారంభం కావాలని, సేవ చేస్తున్నామనే భావనతో వచ్చే అహంకారానికి దూరంగా ఉండాలని వక్తలు హితవు పలికారు. సేవకు అసలైన ప్రతిఫలం ప్రశంసలు లేదా పురస్కారాలు కావని, నిస్వార్థంగా చేసే సేవ మాత్రమే మనశ్శాంతిని, ప్రేమను, ఆనందాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. సేవాదళ్ సభ్యులు ప్రేమతో అందించే సేవలోనే నిజమైన గొప్పతనం దాగి ఉందని అన్నారు. సత్యసాయి బోధించే ప్రేమ మార్గం ద్వారానే దైవత్వాన్ని చేరుకోగలమని, సేవ ఎల్లప్పుడూ నిస్వార్థంగా కొనసాగాలని ఉద్ఘాటించారు. దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. సమ్మేళనం అనంతరం సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.

జిల్లా స్థాయి స్విమ్మింగ్‌లో అనంతలక్ష్మి

విద్యార్థుల సత్తా.. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రతినిధి : జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో సత్తా చాటి, మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మహిళల విభాగంలో అండర్-14 బటర్‌ఫ్లై విభాగంలో పి. సునీత, వి. విష్ణుప్రియ, అండర్-14 బ్యాక్‌స్ట్రోక్‌లో జి. హంసప్రియ, అండర్-17 బ్యాక్‌స్ట్రోక్‌లో జి. రిషిత రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. అలాగే పురుషుల విభాగంలో అండర్-14 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో పి.ఎల్. రుత్విక్, ఎన్. విషాల్, అండర్-17 ఫ్రీస్టైల్‌లో ఎస్. వరుణ్ దీప్ రెడ్డి, అండర్-17 బ్యాక్‌స్ట్రోక్‌లో బి. వెంకటరెడ్డి విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థుల విజయంపై పాఠశాల చైర్మన్ అనంత రాముడు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో పాల్గొని పాఠశాలకు, జిల్లాకు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల సీఏఓ నరసింహారావు, ప్రిన్సిపల్ కె.వి. శాలిని, పీఈటీలు జిలాన్, అజిత్ దాస్ తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సత్తా చాటనున్న సిద్దరాంపురం విద్యార్థులు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రతినిధి : విశాఖపట్నం జిల్లా నక్కపల్లిలో డిసెంబర్ 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న అండర్-17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు సిద్దరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ ఒక ప్రకటనలో వెల్లడించారు. పాఠశాలకు చెందిన హారిక, మునీంద్ర రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కాగా, వర్షిత స్టాండ్‌బై క్రీడాకారిణిగా ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల వ్యాయామ విద్యా సంచాలకులు (పీడీ) గట్టు నాగరాజుతో పాటు ఉపాధ్యాయులు నాగేంద్ర ప్రసాద్, కోటప్ప, ఆదినారాయణ, బాలకృష్ణ, కమల, మధుబాల, ఉమాబాయి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక కావడం పట్ల తోటి విద్యార్థులు సైతం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజయాలు సాధించాలని, తద్వారా పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించింది.

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోబోటిక్ శస్త్రచికిత్సలు రూ.1,011 కోట్లతో భారీ ప్రణాళికలు



రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోబోటిక్ శస్త్రచికిత్సలను దశలవారీగా అందుబాటులోకి తేనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోబోటిక్ శస్త్రచికిత్సలు ప్రభుత్వ బోధనా ఆసుపత్రులను ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోం. ఇందులో భాగంగా, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రాంగణంలో ఉన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యాలయంలో, మంత్రి సత్య కుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెచ్చే ప్రతిపాదనలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.రోబోటిక్ సర్జరీ ప్రవేశపెట్టడం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్స విధానాలను ప్రవేశపెట్టాలని ఆరోగ్య శాఖ నిర్ణయించింది. మొదటి దశలో భాగంగా, విజయవాడలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో రూ.45 కోట్ల వ్యయంతో రోబోటిక్ సర్జరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. తదుపరి దశలో, విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ కర్నూలులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కు ఈ సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.ప్రతిపాదనల్లోని ముఖ్యాంశాలు:ఐవీఎఫ్, బోన్ మారో కేంద్రాలు: గుంటూరు, అనంతపురం, విజయనగరం, కాకినాడ, తిరుపతిలోని బోధనా ఆసుపత్రుల్లో ఐవీఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐవీఎఫ్, బోన్ మారో మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు, సుమారు రూ.1,011 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.అవయవ మార్పిడి కేంద్రాలు: పలాసలో రూ.163.52 కోట్ల వ్యయంతో కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, మరికొన్ని ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రతిపాదనలు రూపొందించారు.క్యాన్సర్ చికిత్స కేంద్రాలు: అనంతపురం, మచిలీపట్నం, విజయవాడ, శ్రీకాకుళం, ఒంగోలులో ఐదు సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీని కోసం సుమారు రూ.500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను పొందేందుకు, కేంద్ర అణుశక్తి శాఖకు ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు.అరుదైన వ్యాధుల కోసం ప్రత్యేక కేంద్రం: అరుదైన వ్యాధుల చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం రూ.17 కోట్లు కేటాయించారు. విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు నగరాల్లోని బోధనా ఆసుపత్రులలో రూ.48 కోట్ల వ్యయంతో 'బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్' కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించారు. వీటితో పాటు, రూ.180 కోట్ల వ్యయంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ పబ్లిక్ హెల్త్' ఏర్పాటు రూ.65 కోట్ల వ్యయంతో ఐసియు విభాగాలను బలోపేతం చేసే అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమీక్ష అనంతరం, బోధనా ఆసుపత్రులలో వైద్య విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ అందేలా చూడాలని, అలాగే కొత్తగా మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా ఐసియు పడకలు, వెంటిలేటర్లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని, వైద్య విద్యా కోర్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. 'స్టేట్-స్పెసిఫిక్ అసిస్టెన్స్/స్కీమ్' ఫ్రేమ్‌వర్క్ కింద రూ.7,369 కోట్ల ఆర్థిక సహాయాన్ని పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో డిపిహెచ్, వెంకటరమణ, ఏపీఎంఎస్ఐడిసి, సిఇ బలరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో బియ్యం రిటైల్ ధరలు
ఖరారు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



రాయదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు అనంతపురం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు రాయదుర్గం పట్టణంలో వివిధ రకాల బియ్యం రిటైల్ విక్రయ (ఎమ్మార్పీ) ధరలను అధికారులు ఖరారు చేశారు. ఈ మేరకు రాయదుర్గం తహసిల్దార్ సూర్య ప్రతాప్, డిప్యూటీ తహసిల్దార్ శ్యామ్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. షాపుల వద్దకు వెళ్లి షాపుల యజమానులకు వివరించి ధర పట్టికలను ఏర్పాటు చేయించారు.?రాయదుర్గం పట్టణంలోని హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు, రైస్ వ్యాపారులు మరియు సూపర్ మార్కెట్ల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకే వినియోగదారులకు బియ్యం విక్రయించాలని అధికారులు స్పష్టం చేశారు. దీని ప్రకారం కిలో బిటిపి-3291 (సోనా) రూ. 66, బీటీపీ -5204 (సాంబ) రూ. 66, కేఎన్ఎమ్ రకం బియ్యం రూ. 66 చొప్పున విక్రయించాల్సి ఉంటుంది. అలాగే హెచ్ఎంటి రూ. 76, ఆర్ఎన్ఆర్ రూ. 76, జై శ్రీరామ్ రూ. 82 మరియు ఎంటియు సాధారణ రకాల బియ్యాన్ని కిలో రూ. 47 లకు మాత్రమే విక్రయించాలని ధరలను నిర్ణయించారు. ?ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించిన ఈ ఎమ్మార్పీ ధరలకే నాణ్యమైన బియ్యాన్ని విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినా లేదా నాణ్యతలో రాజీ పడినా కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ హెచ్చరించారు. వినియోగదారులు బియ్యం కొనుగోలు చేసే సమయంలో సరైన బిల్లును మరియు తూకాన్ని తప్పనిసరిగా పరిచూసుకోవాలని కోరారు. రాయదుర్గం పట్టణంలోని అన్ని వర్గాల వ్యాపారులు ఈ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేసి సహకరించాలని తహసిల్దార్ సూర్య ప్రతాప్, డిప్యూటీ తహసిల్దార్ శ్యామ్ విజ్ఞప్తి చేశారు.

జడ్పీ పీఠాలపై కొలిక్కి వచ్చిన కూటమి కసరత్తు నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు చోటు

కూటమిలో జిల్లా పరిషత్ పీఠాలపై కసరత్తు కొలిక్కి వచ్చిం. జడ్పీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల పంపకాలపై పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదింది జిల్లా పరిషత్ పీఠాలపై కూటమి పార్టీల కసరత్తు అర్ధరాత్రి కొలిక్కి వచ్చిం. జడ్పీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల పంపకాలపై మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిం. జిల్లాల వారీగా పదవుల పంపకం పూర్తి చేశాయి. టీడీపీ తమ అభ్యర్థుల పేర్లనూ ఖరారు చేస్తూ మహిళలకు ప్రాధాన్యం కల్పించిం. టీడీపీ, జనసేన, బీజేపీ పీఠాల పంచాయితీకి ఎట్టకేలకు సమన్వయంతో తెరదించారు. మరోవైపు నేడు జడ్పీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది.రాష్ట్రంలో 27 జిల్లా పరిషత్ స్థానాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ పదవులు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. వీటిని ఏ పార్టీకి కేటాయించాలనే అంశంపై కొన్నిరోజులుగా మూడు పార్టీల ముఖ్యనేతలూ మంతనాలు సాగించారు. బుధ, గురువారాల్లోనూ సీఎం చంద్రబాబు సమక్షంలో విస్తృతంగా చర్చలు జరిపారు. పార్టీల వారీగా పోటీ చేసే స్థానాలను కొక్కి తెచ్చారు. టీడీపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే జనసేనకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాప్ల, కాకినాడ జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులు కేటాయించారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, బాపట్ల, ప్రకాశం, శ్రీసత్యసాయి జిల్లాల వైస్ ఛైర్మన్ స్థానాలు ఆ పార్టీకి దక్కనున్నాయి. బీజేపీకి కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని కేటాయించారు. ఎన్టీఆర్, తిరుపతి జిల్లాల వైస్ ఛైర్మన్ స్థానాలు ఆ పార్టీకి దక్కనున్నాయి. మిగిలిన స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు బరిలో నిలవనున్నారు. టీడీపీ 22 ఛైర్మన్, 20 వైస్ ఛైర్మన్ స్థానాలకు అభ్యర్థుల జాబితాను ప్రకటించింది.జడ్పీ పీఠాధిపతులు వీరే శ్రీకాకుళం జడ్పీ వైస్ ఛైర్మన్‌గా గుంటు విజయ్‌కుమార్‌కు అవకాశం కుంచారు. విజయనగరం ఛైర్‌పర్సన్‌గా మజ్జి సిరి సహస్ర, వైస్ ఛైర్‌పర్సన్‌గా పసల నీరజ పేరు ప్రకటించారు. పార్వతీపురం మన్యం వైస్ ఛైర్మన్‌గా వైరిచర్ల వీరేశ్‌చంద్ర దేవ్ బాధ్యతలు చేపట్టనున్నారు. విశాఖ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా అలివేణి, వైస్ ఛైర్మన్‌గా సుకవాసి అజయ్ ఖారాయ్యారు. అనకాప్ల వైస్ ఛైర్ పర్సన్‌గా పెంటకోట స్వాతికి అవకాశం దక్కింది. పోలవరం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వంతల రాజేశ్వరి, వైస్ ఛైర్‌పర్సన్‌గా తీగల ప్రభ ఎంపికయ్యారు. కాకినాడ వైస్ ఛైర్‌పర్సన్‌గా పిల్లి అనంతలక్ష్మి బాధ్యతలు చేపట్టనున్నారు. తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా కాడ పద్మ, కోనసీమ ఛైర్‌పర్సన్‌గా గొల్లపల్లి అమూల్య ఖారారయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఇందుకూరి రామకృష్ణంరాజు, వైస్ ఛైర్మన్‌గా సిరగాని నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఏలూరు ఛైర్‌పర్సన్‌గా చింతమనేని సాయి నవ్యశ్రీ, వైస్ ఛైర్మన్‌గా బొర్రా చలమయ్య పేర్లు ఖారారయ్యాయి.కృష్ణా జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్‌గా దండమూడి పూజితకు అవకాశం దక్కింది. ఎన్టీఆర్ జిల్లా ఛైర్‌పర్సన్‌గా కోట పుల్లమ్మ ఎంపికయ్యారు. గుంటూరు ఛైర్‌పర్సన్‌గా ధార అరుణ, వైస్ ఛైర్మన్‌గా తల్లా అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు. పల్నాడు ఛైర్‌పర్సన్‌గా పుచ్చకాయల రమాదేవి, వైస్ ఛైర్‌పర్సన్‌గా నల్లపాటి కీర్తన ఎంపికయ్యారు. బాపట్ల ఛైర్‌పర్సన్‌గా పుషడపు రోహిణికి అవకాశం కుంచారు. ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కొక్కిగడ్డ ప్రభాకరరావు ఖారారయ్యారు. మార్కాపురం ఛైర్మన్‌గా కందుల రామిరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా జి.వి.శ్రీనివాసవర్మ ఎంపికయ్యారు. నెల్లూరు ఛైర్మన్‌గా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఛైర్మన్‌గా పొట్టెల్ల ప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు.కర్నూలు ఛైర్మన్‌గా చూడి ఉలిగయ్య, వైస్ ఛైర్‌పర్సన్‌గా షేక్ షాదిక పేర్లు ఖరారయ్యాయి. నంద్యాల ఛైర్మన్‌గా షేక్ బ్రూహానుద్దీన్, వైస్ ఛైర్మన్‌గా కె.శ్రీకాంత్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా గంజే నాగరాజు, వైస్ ఛైర్‌పర్సన్‌గా వెన్నపూస లలిత బాధ్యతలు చేపట్టనున్నారు.



శ్రీసత్యసాయి జిల్లా ఛైర్మన్‌గా పరిటాల శ్రీరామ్ ఎంపికయ్యారు. కడప ఛైర్మన్‌గా పుత్తా నరసింహారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్‌గా హబీబున్నీసా చాంద్‌బాయికి అవకాశం దక్కింది. అన్నమయ్య జిల్లా ఛైర్మన్‌గా సుగవాసి ప్రసాద్‌బాబు, వైస్ ఛైర్‌పర్సన్‌గా తలారి శరణ్య ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా హేమలత ఖారారయ్యారు. చిత్తూరు ఛైర్‌పర్సన్‌గా మాదలం శైలజ, వైస్ ఛైర్మన్‌గా ఎస్.మంజుప్రియ వెంకటేశ్ ఎంపికయ్యారు.నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు చోటు : టీడీపీ ప్రకటించిన జాబితాలో నలుగురు మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, పిల్లి అనంత లక్ష్మి, హేమలత, పోలంరెడ్డి శ్రీనివాస రెడ్డి ఉండగా ఒక మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి ఉన్నారు. రాజకీయ కుటుంబ నేపథ్య వారసులుగా వచ్చిన వారిలో మజ్జి సిరి సహస్ర, వీరేశ్ చంద్రదేవ్, గొల్లపల్లి అమూల్య, చింతమనేని సాయి నవ్యశ్రీ, నల్లపాటి కీర్తన, కందుల రామిరెడ్డి, సుగవాసి ప్రసాద్ బాబు, పరిటాల శ్రీరామ్ ఉన్నారు.

మైనార్టీల సహకారం ఎప్పటికీ మరవలేనిది
అనంతపురం మేయర్ చిట్లూరు రమేష్ గౌడ్



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 20 : ప్రతినిధి : ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా తన ఘన విజయానికి ముస్లిం, మైనార్టీ సోదరులు అందించిన సంపూర్ణ సహకారం ఎప్పటికీ మరవలేనిదని అనంతపురం నగర మేయర్ చిట్లూరు రమేష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని గుత్తిరోడ్ 80 ఫీట్ రోడ్డులో ఉన్న తోహిద్ మస్జీద్‌ను ఆయన సందర్శించి, ముస్లిం పెద్దలు మరియు మైనార్టీలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల కూటమి హవా కొనసాగినప్పటికీ, అనంతపురం నగర ప్రజలు ముఖ్యంగా మైనార్టీ సోదరులు తనపై ఎంతో నమ్మకంతో అండగా నిలిచి, దాదాపు 5,981 ఓట్ల మెజారిటీతో గెలిపించారని కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి మరియు నగరంలోని మైనార్టీ కాలనీల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం మస్జీద్ కమిటీ సభ్యులు మరియు ముస్లిం పెద్దలు మేయర్ రమేష్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, అస్లాం, హిద్దు, మాసౌక్, ఇర్ఫాన్, షారుక్, బి. రాజా రెడ్డి, రామన్న, లక్ష్మణ్, నాగేంద్రతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ముస్లిం పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుపతి రీజియన్ పరిశ్రమలు, ఉద్యాన కేంద్రంగా రూ.9 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు

కీలక రంగాల్లో పెట్టుబడులను సాధించడం ద్వారా తిరుపతి ఆర్థిక రీజియన్‌ను ప్రగతిబాట పట్టించాలని ప్రభుత్వం భావిస్తోంది.కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా తిరుపతి ఆర్థిక రీజియన్‌ను ప్రగతిబాట పట్టించాలని ప్రభుత్వం ఆశిస్తోం. పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుత్, ఉద్యాన రంగాలతో పాటు ప్రతిపాదన దశలో ఉన్నవి కలిపి మొత్తం రూ.9 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాబోచ్చని అంచనా వేసిం. ఈ రీజియన్‌ను 2047 నాటికి రూ.0.9 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుం. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, నెల్లూరు జిల్లాలతో కూడిన ఈ రీజియన్‌లో ఒక్కో జిల్లా ఒక్కో విశిష్టతను చాటిచెప్పేలా ప్రణాళిక రూపొందించారు .ప్రణాళికాబద్ధమైన నగరాలు: ఎలక్ట్రానిక్స్‌లో శ్రీసిటీ-తడ-సూళ్లూరుపేట, క్రిస్‌సిటీగా కృష్ణపట్నం, స్పేస్ సిటీగా నాయుడుపేట, షిప్‌బిల్డింగ్‌లో దుగరాజపట్నం, ఆటోమొబైల్, ఈవీలో ఒర్వకల్లు, స్టీల్, సిమెంట్‌లో కొప్పర్తి-కడప-జమ్మలమడుగు, ఆటో, ఈవీ బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్‌లో పెనుకొండ-పాలసముద్రం-హిందూపురం, టూరిజంలో రేణిగుంట-శ్రీకాళహస్తి, ఏరో స్పేస్‌లో పుట్టపర్తి, పునరుత్పాదక విద్యుత్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో అనంతపురం, ఆటో, ఈవీ, బ్యాటరీలలో చిత్తూరు-కుప్పం కారిడార్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో మదనపల్లె, సిమెంట్‌లో నంద్యాల, నాలెడ్జ్ సర్వీసెస్‌లో గ్రేటర్ తిరుపతి, కర్నూలు, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల విస్తరణలో నెల్లూరు ప్రణాళిక బద్ధమైన నగరాలుగా వృద్ధి చెందుతున్నాయి.ఉద్యానాభివృద్ధి ప్రణాళికలో 80 శాతం: రాష్ట్రంలో 201 క్లస్టర్లలో సమగ్ర ఉద్యానాభివృద్ధి ప్రణాళిక అమలు చేస్తుండగా, వాటిలో 185 రాయలసీమలోనే ఉన్నాయి. ఈ రంగంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడి అంచనాలు ఉండగా, వాటిలో 80 శాతం



తిరుపతిలోనే ఉన్నాయి. డెయిరీ, మీట్, కోళ్ల పెంపకం, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు, టెర్మినల్ మార్కెట్లలో పెట్టుబడి ప్రతిపాదనలు ఉన్నాయి.విమాన తయారీ రంగంలోనూ: శ్రీసత్యసాయి, తిరుపతి, కర్నూలు జిల్లాలు ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, నిర్వహణ, మరమ్మత్తులకు కేంద్రాలుగా ఉన్నాయి. ఏరోస్పేస్, డిఫెన్స్ పాలసీ కింద ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయి. దీని ద్వారా లక్ష మంకి ఉద్యోగాలు దక్కనున్నాయి. కడప, కర్నూలు విమానాశ్రయాల్లో శిక్షణ, పరీక్షలకు గగనతలం అందుబాటులో ఉం. ఫ్లైట్ టెస్ట్ అండ్ ఇంటిగ్రేషన్ బెల్ట్, ఏరోస్ట్రక్చర్ అండ్ ప్రెసిషన్ పార్క్ కాంపొనెంట్ అండ్ ఇంజిన్ ఎంఆర్‌వో హబ్, ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, డ్రోన్ టెస్ట్ కారిడార్ ల్యాబ్‌లలో పెట్టుబడి ప్రతిపాదనలు ఉన్నాయి.రక్షణ రంగానికి శ్రీసత్యసాయి జిల్లా కీలకం: రక్షణ రంగ పరికరాల తయారీ రంగంలో శ్రీసత్యసాయి జిల్లా ఎనర్జెటిక్స్, క్షిపణులకు ప్రధాన కేంద్రంగా ఉండగా, దుత్తలూరు, ఓర్వకల్లు ద్వితీయ కేంద్రాలుగా ఉన్నాయి. 2029 నాటికి దేశంలో 34 బిలియన్ డాలర్ల రక్షణ ఉత్పత్తులు ఉంటాయని అంచనా. కాగా ఇందులో 5-7 శాతం తిరుపతి రీజియన్‌లోనే ఉండనున్నాయి. ఎనర్జెటిక్స్, మందుగుండు జోన్, మందుగుండు ప్రూఫ్ రేంజ్, డ్రోన్ టెస్ట్ కారిడార్, డిఫెన్స్ సప్లయర్ పార్క్‌లో ప్రతిపాదిత పెట్టుబడులు రానున్నాయిఎలక్ట్రానిక్స్‌కు హబ్: రాష్ట్రంలో 50 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్, వాటి విభాగాలు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 70-80% పెట్టుబడులు తిరుపతి పరిధిలోని శ్రీసిటీ, నాయుడుపేట సెజ్‌లలో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల్లో ఉంటాయి. ఎలక్ట్రానిక్స్‌లో భారీ యూనిట్ల ద్వారా వచ్చే పెట్టుబడులలో 98 శాతం ఈ రీజియన్‌లోనే ఉన్నాయి. అప్లయెన్స్ వెండర్ పార్క్, వీసీబీ కామన్ ప్లేటింగ్ అండ్ సీఈటీపీ, పాసివ్ కాంపొనెంట్ పార్క్, ఎలక్ట్రానిక్స్ టెస్ట్ ల్యాబ్, ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోల్లో పెట్టుబడులు రానున్నాయి.పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు: పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు ప్రధానంగా తిరుపతి రీజియన్‌లోనే ఏర్పాటు అవుతున్నాయి. క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 2029 నాటికి రాష్ట్రంలో 113 డాలర్ల పెట్టుబడులు రానున్నాయి. అయితే ఇందులో 80 శాతం ఈ రీజియన్‌లో ఉండనున్నాయి. 20 గిగావాట్ల ఇంటిగ్రేటెడ్ సోలార్ సైన్, పంప్స్ అండ్ బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ అమ్మోనియా హబ్, విండ్ కాంపొనెంట్స్ పార్క్‌లలో పెట్టుబడులు రానున్నాయి.అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు మూలం: స్పేస్‌లాంచ్, తయారీ, మరమ్మత్తులు, సేవా రంగాల్లో తిరుపతి రీజియన్ కీలక పాత్ర పోషిస్తుం. దేశంలోని ఏకైక ఆర్బిట్ లాంచ్‌సైట్ ఈ రీజియన్‌లోనే ఉం. తిరుపతి స్పేస్ సిటీలో మొదటి బ్లాక్ కోసం 2,800 ఎకరాలు కేటాయించారు. కాగా గాదంకిలోని ఎన్ఏఆర్ఎల్, తిరుపతి ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ ఈ రంగంలో పరిశోధనా కేంద్రాలుగా ఉన్నాయి. కామన్ అసెంబ్లీ టెస్ట్ ఫెసిలిటీ, కమర్షియల్ లాంచ్ కాంపైక్స్, లింక్ స్పేస్ టు టూరిజం అండ్ స్కిల్స్, షార్‌కు 6 వరుసల కారిడార్ నిర్మాణంలో పెట్టుబడుల ప్రతిపాదనలు ఉన్నాయి.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాసం వద్ద బిల్డర్ హల్‌చల్..



ఆత్మహత్యాయత్నంతో (తెలుగు కలం) (నవంబర్ 20 : హైదరాబాద్ తెలుగుకలం ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసం వద్ద ఒక బిల్డర్ హల్‌చల్ సృష్టించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో ఉన్న పవన్ కళ్యాణ్ ఇంటి ముందు ఖమ్మం జిల్లా బల్లేపల్లికి చెందిన బిల్డర్ సుచేతన్ రాకుమార్ నాయక్ ఆందోళనకు దిగాడు. తన వ్యక్తిగత సమస్యలను చెప్పుకుని, ఆర్థిక సాయం కోరేందుకు గత 16 రోజులుగా పవన్ కళ్యాణ్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నానని, అయితే అవకాశం లభించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని పేర్కొంటూ అతను ప్లెక్సీతో నిరసన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలోనే అక్కడ ఒక్కసారిగా కత్తితో తన ఛాతీ, చేతులపై గాయాలు చేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో స్థానికంగా కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మరియు పోలీసులు అతడిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన సుచేతన్ రాకుమార్ నాయక్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు, ఈ ఘటన వెనుక ఉన్న పూర్తి కారణాలపై లోతుగా విచారణ చేపట్టారు. ఈ పరిణామంతో పవన్ కళ్యాణ్ నివాసం వద్ద కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

రూపాయి ఖర్చు లేకుండా మాతృత్వం గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో ముగ్గురు శిశువుల జననం

సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా అంచిన ఐవీఎఫ్ చికిత్స ద్వారా ఏళ్లుగా సంతానం కోసం ఎదురుచూసిన ముగ్గురు దంపతులకు ఆ ఆనందం దక్కిం. శ్రీగాంధీ ఆసుపత్రిలో ఐవీఎఫ్‌తో సంతానం ఏళ్లుగా సంతానం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసిం. గతంలో పిల్లలు పుట్టని దంపతుల జీవితాల్లో గాంధీ ఆసుపత్రి కొత్త వెలుగును నింపిం. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తల్లిదండ్రులు కావడంతో వారు ఎంతో సంతోషంతో మునిగిపోయారు. గాంధీ ఆసుపత్రిలోని ఐవీఎఫ్ కేంద్రంలో, వైద్యులు అత్యాధునిక సంతానోత్పత్తి సాంకేతికత ద్వారా ముగ్గురు జంటలకు సంతాన భాగ్యాన్ని కృంచారు. ప్రైవేట్ వైద్యం ఆర్థికంగా భారంగా మారిన తరుణంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ ఐవీఎఫ్ సేవల ద్వారా తమ కలదండ్రులు కావాలనే కల నెరవేరడంతో ఆ దంపతులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.16 ఏళ్ల నిరీక్షణ తర్వాత లభించిన వరంవరంగల్‌కు చెంన కారు డ్రైవర్ రాజు (38), ఆయన భార్య దాసరి స్వరూప (35) దంపతులు 16 ఏళ్లుగా పిల్లల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో వారు ప్రైవేట్ ఆసుపత్రిలో ఐవీఎఫ్ చికిత్స కోసం సుమారు రూ.3--4 లక్షలు ఖర్చు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం రాలేదు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మరిన్ని చికిత్సలు చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న వారికి గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా ఐవీఎఫ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిసిం. ఇక్కడ వైద్యులు అందించిన చికిత్సతో స్వరూప పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు.శ్రీగాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్‌తో ముగ్గురికి సంతానం పదేళ్లకు కల సాకారమయ్యిందియాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సెక్యూరిటీ గార్డు విజయ్ కుమార్ (35), ఆయన భార్య పీసరి మాధవి (35) పదేళ్లుగా సంతానం కోసం వేచి చూశారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 21 - 11 - 2026

రూ.5 లక్షల ఉచిత బీమా.. ఈ పని చేయండి చాలు..!



తెలంగాణ ప్రభుత్వ ప్రజలకు ఉచితంగా రూ.5 లక్షల బీమా అందించేందుకు ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా ప్రతి ఒక్క కుటుంబానికి ఉచితంగా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనుంది. ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే.. ప్రతి ఒక్కరికి ఆర్థిక భరోసా ఉండాలని చెబుతున్నారు. కుటుంబ పెద్ద ఆధారపడి ఉన్న కుటంబ సభ్యులకు ఈ పథకం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కాగా ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి గురువారం నాడు సిద్ధిపేటలో ప్రారంభించారు. గురువారం నుంచి ఇందిరమ్మ కుటుంబ బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 18 వరకు నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలు, ఆన్‌లైన్ లేదా ఇంటింటి సర్వే ద్వారా వివరాలు నమోదు చేస్తారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించనక్కర్లేదు.. పూర్తి ప్రీమియం ప్రభుత్వమే భరిస్తుంది. కుటుంబ పెద్దకు ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రోడ్డున పడకూడదని ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎక్కడ ఫుడ్‌సేఫ్టీ కార్డు ఉన్నా ఇక్కడ నమోదు చేసుకునేందుకు వస్తే వారి పేర్లు నమోదు చేయాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. హైదరాబాదీలకు గుడ్ న్యూస్.. ట్రాఫిక్ ప్రాంతాల్లో పాడ్ కార్ల నెట్‌వర్క్ ఏర్పాటు..! దరఖాస్తు నమోదు చేసే క్రమంలో కుటుంబ పెద్దతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు, నామినీ వివరాలు తప్పకుండా ఇవ్వాలి. దరఖాస్తు ఫారం మొదటి భాగంలో ప్రదేశ వివరాలు కింద లబ్ధిదారుల నివాస ప్రాంత సమాచారాన్ని కోడ్‌లతో సహా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇందులో జిల్లా, శాసనసభ నియోజకవర్గం పేరుతో పాటు వాటికి సంబంధించిన ప్రత్యేక కోడ్‌లను పొందుపరచాలి. నివాస ప్రాంతాన్ని గ్రామీణ, పట్టణ విభాగాలుగా విభజించగా, గ్రామీణ ప్రాంతాల వారు మండలం, రెవెన్యూ గ్రామం, గ్రామ పంచాయతీ, వార్డు కోడ్‌లతో పాటు వీధి పేరు, ఇంటి నంబరు రాయాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల లబ్ధిదారులు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, జోన్, సర్కిల్, వార్డు కోడ్‌లు, వీధి పేరు, ఇంటి నంబరు వివరాలను పూర్తిగా ఫిల్ చేయాలి. వీటితో పాటు లబ్ధిదారుడికి ఆహార భద్రతా కార్డు (రేషన్ కార్డు) నంబరు కలిగి ఉంటే దానిని నమోదు చేయడంతో పాటు కులం, మతం వివరాలను నిర్దిష్ట కోడ్‌ల రూపంలో తెలియజేయాల్సి ఉంటుంది. ఫారం రెండో విభాగంలో బీమా దారుడి వివరాలు, ఇతర కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసేందుకు ప్రత్యేక పట్టికలను ఇచ్చారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

హైదరాబాదీలకు గుడ్ న్యూస్.. ట్రాఫిక్ ప్రాంతాల్లో పాడ్ కార్ల నెట్‌వర్క్ ఏర్పాటు..!




హైదరాబాద్ లో రోజు రోజుకు ట్రాఫిక్ భారీగా పెరుగుతోంది. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఉంటుంది. ఐటీ కారిడార్ లో కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ను సులభతరం చేయడానికి చర్యలు చేపట్టింది. రోడ్డు మార్గంతో దానిని మెట్రోతో అనుసంధానించడానికి ఉద్దేశించిన ఒక కొత్త రవాణా ప్రాజెక్టు శ్రీకారం చుట్టనుంది. మొదటి దశలో తెలంగాణ ప్రభుత్వం 35 కిలోమీటర్ల డ్రైవర్‌లేని పాడ్ కార్ల నెట్‌వర్క్‌ను ప్రతిపాదించింది. పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ మొదటి దశ కారిడార్ లో కూకట్‌పల్లి నుంచి రాయదుర్గం, బయోడైవర్సిటీ పార్క్ మీదుగా నాలెడ్జ్ సిటీ వరకు నడుస్తుంది. మార్గమధ్యంలో 64 స్టేషన్లు ఉంటాయి. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులు నవంబర్ 18న బుధవారం నాడు సచివాలయంలో జరిగిన ఒక సమావేశంలో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు ఈ ప్రణాళికను సమర్పించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఒక రూట్ మ్యాప్, కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జాజు వారిని కోరారు. సాధ్యాసాధ్యాల అధ్యయనం నిర్వహించిన 2030 నాటికి ప్రయాణికుల డిమాండ్ 3.94 లక్షలు, 2040 నాటికి 7.96 లక్షలు, 2050 నాటికి దాదాపు 10 లక్షలకు పెరుగుతుందని అంచనా వేసింది. కుప్పకూలుతున్న బంగారం ధరలు.. ఇప్పుడే కొనేయాలా..! ఎలివేటెడ్ ట్రాక్‌లపై చిన్న ఎలక్ట్రిక్ పాడ్‌లను ఉపయోగిస్తుంది. హెచ్ఎంఆర్ఎల్ గ్రూప్ రాపిడ్ ట్రాన్సిట్, ఇతర ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించింది. ఈ రెండు పాడ్ వ్యవస్థలను మెట్రో రైల్, ఆర్టీసీ బస్సు సర్వీసులతో అనుసంధానించనున్నారు. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో నిర్మించాలని జజు అన్నారు. ట్రాఫిక్ సాంద్రత, ప్రయాణికుల అవసరాల ఆధారంగా మార్గాలను ఎంచుకోవాలని, ఇప్పటికే ఉన్న రవాణా మౌలిక సదుపాయాలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన అధికారులను కోరారు. సాంకేతిక నిపుణులు, సాధ్యమయ్యే ప్రాజెక్ట్ భాగస్వాములతో సంప్రదింపులను వేగవంతం చేయాలని ఆయన హెచ్ఎంఆర్ఎల్‌కు సూచించారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించేందుకు పురపాలక పరిపాలన, ఇంధన, పోలీస్, ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే, హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తి పరిరక్షణ ఏజెన్సీ (హైడ్రా) వంటి సంబంధిత విభాగాల మధ్య సన్నిహిత సమన్వయం ఉండాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. నవంబర్ 12న ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం ఈ సమీక్ష జరిగింది. ఆ సమావేశంలో ఆయన, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రాహేజా మైండ్‌స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు పీఆర్‌టీఎస్ కారిడార్‌ను చేపట్టాలని, గచ్చిబౌలిలోని ఐకియా సమీపంలో పీఆర్‌టీఎస్ డిపోతో కూడిన మల్టీలెవల్ పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

లార్జ్ క్యాప్ ఫండ్లకు టైమొచ్చిందా.. అక్టోబర్ లో రాణించిన ఫండ్లు ఇవే..!



అక్టోబర్ లో వివిధ మ్యూచువల్ ఫండ్ కేటగిరీల పనితీరులో తీవ్రమైన తేడాలు కనిపించాయి. ఆ నెలలో లార్జ్‌క్యాప్ ఫండ్‌లు 9.8 శాతం రాబడిని అందించగా, స్మాల్‌క్యాప్ ఫండ్‌లు కేవలం 0.7 శాతం రాబడిని ఇచ్చాయి. మరోవైపు మిడ్‌క్యాప్ ఫండ్‌లు 4 శాతం రాబడిని అందించాయి. ఈ మార్పు రాబడులలోనే కాకుండా పెట్టుబడులు స్వీకరించడంలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. లార్జ్‌క్యాప్ ఫండ్‌లలోకి పెట్టుబడులు పెరగ్గా.. స్మాల్‌క్యాప్ ఫండ్‌లలోకి పెట్టుబడులు తగ్గాయి. దీనివల్ల పెట్టుబడిదారులు స్మాల్‌క్యాప్ ఫండ్‌లపై తమ ఉత్సాహాన్ని కొంత కోల్పోయి, పెద్ద కంపెనీల షేర్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. వాలమ్ క్యాపిటల్ అడ్వైజర్స్ వారి నివేదిక ప్రకారం గత నెలలో భారతీయ ఈక్విటీలు బలంగా పుంజుకున్నాయి. ఈ కాలంలో భారతీయ ఈక్విటీ ఫండ్‌లు సగటున 6 శాతం రాబడిని అందించాయి. అదే సమయంలో గ్లోబల్ ఈక్విటీ ఫండ్‌లు 6.5 శాతం క్షీణించగా, బంగారం, వెండి వంటి విలువైన లోహాలలో పెట్టుబడి పెట్టే ఫండ్‌లు 7.7 శాతం పడిపోయాయి. గత నెలలో భారతీయ ఈక్విటీ ఫండ్లలోకి నికర పెట్టుబడుల ప్రవాహం రూ.39,071 కోట్ల నుంచి రూ.40,410 కోట్లకు పెరిగిందని నివేదిక పేర్కొంది. గత నెలలో మ్యూచువల్ ఫండ్ వర్గాల మధ్య పనితీరు అంతరం గణనీయంగా పెరిగింది. మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారా.. అయితే ఈ పని చేయండి..! లార్జ్‌క్యాప్ ఫండ్లు 9.8 శాతం రాబడిని అందించగా, మిడ్‌క్యాప్ ఫండ్లు 4 శాతం, స్మాల్‌క్యాప్ ఫండ్లు కేవలం 0.7 శాతం రాబడిని అందించాయి. అంటే ఒకే నెలలో లార్జ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్ల రాబడుల మధ్య అంతరం 9.1 శాతం పాయింట్లుగా ఉంది. భారతీయ ఈక్విటీలలోకి విదేశీ పెట్టుబడిదారులు తిరిగి రావడం ఈ ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉంది. వారి కొనుగోళ్లు ఎక్కువగా పెద్ద కంపెనీల షేర్లలోనే కేంద్రీకృతమయ్యాయి. అందువల్ల ఈ మార్కెట్ ర్యాలీ అన్ని కంపెనీలకు ఏకరీతిగా ప్రయోజనం చేకూర్చలేదు. పెద్ద కంపెనీల స్టాక్‌లు బలమైన కొనుగోళ్లను ఆకర్షించగా చిన్న కంపెనీలు వెనుకబడ్డాయి. పెట్టుబడి ప్రవాహాలు కూడా మారుతున్న ధోరణిని సూచిస్తున్నాయి. లార్జ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు ఒక నెలలో దాదాపు 44 శాతం పెరిగి.. ర.9,634 కోట్ల నుంచి రూ.13,887 కోట్లకు చేరింది. దీనికి భిన్నంగా స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి వచ్చే నికర పెట్టుబడులు రూ.8,071 కోట్ల నుంచి రూ.5,152 కోట్లకు తగ్గాయి. అంటే దాదాపు 36 శాతం క్షీణత నమోదైంది. దీని అర్థం పెట్టుబడిదారులు స్మాల్‌క్యాప్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం మానేశారని కాదు. అక్టోబరు నెలలో కూడా ఈ విభాగంలోకి రూ.5,000 కోట్లకు పైగా నికర పెట్టుబడులు వచ్చాయి. అయితే, అంతకుముందు నెలతో పోలిస్తే పెట్టుబడిదారుల ఆసక్తి స్పష్టంగా తగ్గింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ ఐపీఓ ప్రారంభం.. దరఖాస్తు చేసుకోవాలా..!




ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ ఐపీఓ గురువారం ఓపెన్ అయింది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.8,981.12 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఒక్కో షేరుకు రూ.129 నుంచి రూ.136 వరకు ధరల శ్రేణిని నిర్ణయించింది. భారతదేశంలోని అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థల్లో ఒకటైన వీజూలో వాటాను పొందే అవకాశం ఈ ఐపీఓ ద్వారా పెట్టుబడిదారులకు లభిస్తుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో (26) దేశీయ బొగ్గు ఉత్పత్తిలో ఈ సంస్థ వాటా 21 శాతంగా ఉంది. ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ ఉండనుంది. ఇందులో విక్రయించే షేర్లు కోల్ ఇండియాకు చెందినవి, కాబట్టి ఈ ప్రక్రియ ద్వారా వచ్చే ఆదాయం మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ కి దక్కదు. ఈ ఐపీఓ నవంబర్ 19న ప్రారంభమై, నవంబర్ 23న ముగుస్తుంది. ఇది బుక్-బిల్ట్ ఇష్యూ. అంటే పెట్టుబడిదారులు నిర్ణీత ధరల శ్రేణిలో తమ బిడ్లను దాఖలు చేయవచ్చు. బిడ్డింగ్ ప్రక్రియ పూర్తయ్యాక తుది ధరను నిర్ణయిస్తారు. ఒక్కో షేరు ముఖ విలువ రూ.2గా ఉంది. ఈ ఐపీఓలో మొత్తం 661,836,300 ఈక్విటీ షేర్లు ఉన్నాయి. పెట్టుబడిదారులు కనీసం 110 షేర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. గరిష్ట ధర రూ.136 చొప్పున లెక్కిస్తే రిటైల్ పెట్టుబడిదారులకు ఒక లాట్ ధర రూ.14,960 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 10 శాతం పెరిగిన ఎల్టీ ఫుడ్స్ స్టాక్.. ఐదేళ్లలో 545 శాతం రాబడి..! ఈ ఇష్యూలో కొంత భాగాన్ని అర్హులైన ఉద్యోగుల కోసం, ఇప్పటికే కోల్ ఇండియాలో వాటాలు కలిగి ఉన్న వారి కోసం కేటాయించారు. ఉద్యోగులకు ఒక్కో షేరుపై రూ.6 రాయితీ కూడా లభిస్తుంది. మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ షేర్లు బీఎస్ఈ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లలో లిస్ట్ కానున్నాయి. పబ్లిక్ ఇష్యూ ప్రారంభానికి ముందే యాంకర్ బుక్ ద్వారా సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి ఈ ఐపీఓకు మంచి స్పందన లభించింది. నవంబర్ 18న 53 ఫండ్లకు ఒక్కో షేరును రూ.136 చొప్పున మొత్తం 16,87,68,255 షేర్లు కేటాయించారు. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ రూ.2,295.2 కోట్లను సమీకరించింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యాంకర్ కేటాయింపులో అతిపెద్ద పెట్టుబడిదారుగా నిలిచింది. ఎల్ఐసీ దాదాపు రూ.568 కోట్ల విలువైన షేర్లు కేటాయించింది. నిప్పాన్ లైఫ్ ఇండియా ట్రస్టీ రూ.500 కోట్ల విలువైన షేర్లను పొందింది. వీటితో పాటు అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్, మరికొన్ని దేశీయ బీమా, మ్యూచువల్ ఫండ్ సంస్థలు కూడా ఇందులో పాల్గొన్నాయి. 1992లో స్థాపించిన మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా ప్రధాన అనుబంధ సంస్థలలో ఒకటిగా ఉంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

గుడ్ న్యూస్ చెప్పిన ఈపీఎఫ్ఓ.. రిటైర్డ్ తర్వాత సిస్టమ్యాటిక్ విత్‌డ్రాకు అవకాశం..



ఉద్యోగం చేసే దాదాపు అందరికీ పీఎఫ్ ఖాతా ఉంటుంది. ఉద్యోగులు తమ జీతం నుంచి కొంత మొత్తాన్ని పీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. అంతే మొత్తంలో యాజమాన్యం కూడా జమ చేస్తోంది. ఈ మొత్తంలో ఈపీఎస్ కూడా ఉంటుంది. ఉద్యోగి జీతం మొత్తం పీఎఫ్ ఖాతాలో జమ అవుతుంది. యాజమాన్యం చెల్లించిన మొత్తంలో కొంత పీఎఫ్ ఖాతాకు, మిగతాది ఈపీఎస్ లో జమ అవుతుంది. పీఎఫ్ సొమ్మును అత్యవసర పరిస్థితిల్లో కొంత మొత్తం విత్ డ్రా చేసుకోవచ్చు. లేదా అలాగే ఉంచుకోవచ్చు. ఈ డబ్బులన్నీ ఉద్యోగి రిటైర్మెంట్ తర్వాత వస్తాయి. అయితే ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన తర్వాత పీఎఫ్ సొమ్మంతా ఒక్కసారిగా వచ్చేస్తుంది. ఈపీఎస్ లో ఉన్న మొత్తం ప్రకారం నెలనెలా పింఛన్ వస్తుంది. అయితే ఇప్పుడు ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం తీసుకుంది. పీఎఫ్ డబ్బులు రిటైర్మెంట్ తర్వాత ఒక్కసారిగా కాకుండా.. నెలనెలా విడతలవారీగా పొందే సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ కి ఈపీఎఫ్ఓ ఆమోదం తెలిపింది. పదవీ విరమణ తర్వాత ఆర్థిక అవసరాలను సక్రమంగా నిర్వహించుకునేందుకు ఇది ఖాతాదారులకు అద్భుతమైన అవకాశమని నిపుణులు చెబుతున్నారు. తొలి దశలో 55 ఏళ్లు పైబడిన 6లక్షల 30వేల మంది ఈపీఎఫ్ఓ సభ్యులకు ఈ సదుపాయం వల్ల లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఉద్యోగులకు గుడ్ న్యూస్.. విత్ డ్రా పరిమితిని 75 శాతం నుంచి 90 శాతానికి పెంపు..! ద్వారా రిటైరైన సభ్యులు తమ మొత్తం పీఎఫ్ సొమ్మును ఒకేసారి తీసుకోకుండా.. క్రమం తప్పకుండా వాయిదాల రూపంలో విత్‌డ్రా చేసుకోవచ్చని చెబుతున్నారు. ఇలా తీసుకోగా మిగిలిన బ్యాలెన్స్ ఈపీఎఫ్ వ్యవస్థలోనే ఉండి.. ప్రభుత్వం అందించే వడ్డీ వస్తూనే ఉంటుందని వివరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల సీనియర్ సిటిజన్లు ఎఫ్డీలో డిపాజిట్ చేయకుండా పీఎఫ్ లోనే డబ్బులు ఉంచుకునే అవకాశం ఉంది. ఇందులో అనేక సౌకర్యవంతమైన ఆప్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. కార్పస్ నుంచి నిర్దిష్ట వ్యవధిలో విత్‌డ్రా చేసుకోవడం, కొంత మొత్తాన్ని ముందుగానే తీసుకుని మిగిలిన దానిపై వాయిదాలు పొందడం లేదా కేవలం వచ్చే వడ్డీని మాత్రమే తీసుకునే వెసులుబాటును కల్పించారు. రిటైర్మెంట్ తర్వాత కూడా స్వచ్ఛందంగా పీఎఫ్‌లో జమ చేసే మార్గాలను ఈ ఫ్రేమ్‌వర్క్ తీసుకువచ్చే అవకాశం ఉంది. పేరోల్ ద్వారా అదనపు డబ్బు జమ, నేరుగా డిపాజిట్లు, డిజిటల్ పేమెంట్ల ద్వారా చిన్న మొత్తాల జమ వంటివి ఇందులో భాగం అయ్యే అవకాశం ఉంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

గుడ్ న్యూస్.. నవంబర్ 26న బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ..!



ఎన్నో ఏళ్లుగా పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో కొత్తగా 4,63,857 మందికి చేయూత పింఛన్ మంజూరు చేసింది. కొత్త పెన్షన్లు మంజూరు అయిన వారికి నవంబర్ 12 నుంచి 18 మధ్య మంజూరు పత్రాలు జారీ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. కొత్తగా పింఛన్ మంజూరు అయిన వారికి ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ శుభవార్త చెప్పారు. నవంబర్ 26న కొత్త పింఛన్ మంజూరు అయిన 4,63,857 మందికి పెన్షన్ మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాత వారితో పాటు కొత్తవారికి పెన్షన్ డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. కొత్తగా 4,63,857 చేయూత పెన్షన్లు డబ్బులు జమ చేయనుండగా.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. పింఛన్లలో వితంతువులకే సింహభాగం దక్కింది. మొత్తం కొత్త లబ్ధిదారుల్లో దాదాపు 60 శాతం అంటే 2,77,894 మంది వితంతువులకు ప్రభుత్వం కొత్తగా పింఛన్లు ఇచ్చింది. 1,00,224 మంది దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేసింది. 53,844 మంది ఒంటరి మహిళలు, 27,444 మంది గీత కార్మికులు, 4,451 మంది చేనేత కార్మికులకు కొత్త పెన్షన్లు వచ్చాయి. ఉచితంగా రూ.5 లక్షల బీమా.. ఇలా దరఖాస్తు చేసుకోండి..! మొదటగా నవంబర్ 19న బ్యాంకు ఖాతాల్లో పింఛన్ డబ్బులు జమ చేయాలని భావించారు. కానీ అనివార్య కారణాల వల్ల నవంబర్ 26న పింఛన్ డబ్బులు జమ చేయనున్నారు. కొత్త పింఛన్ల మంజూరులో హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 35,730 పింఛన్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా 30,232, నల్గొండ జిల్లా 26,546, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 25,671, ఖమ్మం జిల్లాకు 22,801 పెన్షన్లు మంజూరయ్యాయి. అత్యల్పంగా ములుగు జిల్లాలో కేవలం 4,087 కొత్త పింఛన్లు మాత్రమే వచ్చాయి. వితంతు పించన్లు-24,956, ఒంటరి మహిళా పించన్లు-4,714 హైదరాబాద్‌లోనే అత్యధికంగా మంజూరయ్యాయి. దివ్యాంగుల పించన్లు(7,007), గీత కార్మికుల పించన్ల (3,492) లో నల్గొండ జిల్లా మొదటి స్థానంలో నిలవగా, చేనేత కార్మికుల పింఛన్లు యాదాద్రి భువనగిరి (932), రాజన్న సిరిసిల్ల (910) జిల్లాల్లో ఎక్కువగా వచ్చాయి. నవంబర్ 26న కొత్త పింఛన్ల డబ్బులు జమతో పాటు ఇందిరమ్మ చీరలు కూడా పంపిణీ చేయనున్నారు. కోటి మంది మహిళలకు చీరలు అందించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

జీరో కట్స్‌తో సెన్సార్ పూర్తి చేసుకున్న సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'.. విడుదల ఎప్పుడంటే?



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'మాతృభూమి' ('మాతృభూమి: మే ఎండ్ బెస్ట్ ఆఫ్ కీడ్') చిత్రం సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఖచ్చితంగా 16+ సర్టిఫికెట్ జారీ చేసింది. ఎలాంటి కట్స్ సూచించకుండానే సినిమాకు క్లియరెన్స్ లభించడం విశేషం. ఈ చిత్రం మొత్తం నిడివి 2 గంటల 34 నిమిషాల 12 సెకన్లుగా ఖరారైంది. తొలుత నవంబర్ 20న విడుదల చేయాలనుకున్నప్పటికీ, కొన్ని కారణాలతో వాయిదా పడింది. తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. 2020 గల్వాన్ లోయ ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. దేశ రక్షణ కోసం పోరాడే సైనికాధికారి కల్నల్ సంతోష్ బాబు పాత్రలో సల్మాన్ ఖాన్ నటించగా, కుటుంబ బాధ్యతలను నిలబెట్టే భార్య పాత్రలో చిత్రాంగదా సింగ్ కనిపించనున్నారు. వీరిద్దరి త్యాగం, భావోద్వేగాల చుట్టూ కథ సాగుతుంది. మొదట ఈ సినిమాను 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరుతో ప్రకటించగా, మార్చి 2026లో 'మాతృభూమి'గా మార్చారు. ప్రభుత్వ ఒత్తిడితో స్క్రిప్ట్‌లో మార్పులు చేశారన్న వార్తలను సల్మాన్ ఖాన్ ఖండించారు.

'దళపతి' సీన్ రీక్రియేట్ చేసిన అనిల్ రావిపూడి



వినూత్న ప్రమోషన్లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంలో దర్శకుడు అనిల్ రావిపూడి ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తన కొత్త సినిమా 'జనవరి 12 విడుదల' ప్రమోషన్లను కూడా అదే తరహాలో ప్రారంభించారు. ఈ సినిమాలోని పాటల సందడిని రేపటి నుంచి మొదలుకానుందని వినూత్నంగా ప్రకటించారు.

దళపతి సినిమాలోని ఇలయరాజా సూపర్‌స్టార్ రజనీకాంత్, శోభన నటించిన 'దళపతి' సినిమాలోని ఓ ఫేమస్ సన్నివేశాన్ని నటి కృతిశెట్టితో కలిసి రీక్రియేట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది నెట్టింట వైరల్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్లు 'మళ్లీ కొత్త కాన్సెప్ట్ అనిల్ భయ్యా.. ఈ సారి రజనీసార్‌నే చాడేశారు'గా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా ఇంతకుముందు వివాహ భోజనంబు చిత్రంలోని సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందం మధ్య జీన్‌లో జరిగే ఓ సన్నివేశాన్నిమ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్‌తో రీక్రియేట్ చేశారు. ఎంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీని సాహం గారపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు. పచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మాస్ యాక్షన్ విందుతో బెల్లంకొండ 'టైసన్ నాయుడు' టీజర్.!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సాగర్ కె. చంద్ర తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించనున్నారు. నేహా శెట్టి, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో సరేష్, రావు రమేష్, సునీల్ చదివారులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఫీడ్స్ సినిమాటోగ్రఫీ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'మదరాసి రుక్మిణి వసంత్' పాటకు మంచి స్పందన లభించగా, తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలోనే చిత్ర విడుదల తేదీపై మేకర్స్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

మెన్స్ డే స్పెషల్.. 'రాపో23' ప్రీ-లుక్ వైరల్!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లోనే ఒక పెద్ద సాహసానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు హీరోగా అలరించిన ఆయన, ఇప్పుడు తొలిసారిగా కథ రాసి, దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న 'రాపో23' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా, నియో-నోయిర్ శైలిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఆరంభం నుంచే మంచి ఆసక్తి నెలకొంది.

నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మెన్స్ డే) సందర్భంగా రామ్ పోతినేని ఈ సినిమా నుంచి ఒక ఆసక్తికరమైన ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. "ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్" అనే క్యాప్షన్‌తో పచ్చిన ఈ పోస్టర్‌లో రామ్ తనదైన శైలిలో, కొత్త లుక్‌తో కనిపిస్తూ అభిమానుల్లో జోష్ నింపారు. తన దారిని తానే ఎంచుకుంటూ, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే స్వతంత్ర వ్యక్తిగా ఈ పాత్రను ఆయన పరిచయం చేశారు. ఈ పోస్టర్ ద్వారా అందరికీ మెన్స్ డే విషెస్ చెప్పిన చిత్రబృందం, త్వరలోనే సినిమా ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ సినిమా టైటిల్ ఏంటి, టీజర్ ఎలా ఉండబోతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తుండగా, ఎస్. తిరునావుక్కరసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూస్తున్నారు. దర్శకుడిగా, నటుడిగా రామ్ పోతినేని ఈ సినిమాతో ఎలాంటి కొత్త అనుభూతిని పంచుతారో చూడాలి.

20 రోజులకే ఓటీటీలోకి వచ్చేసిన విశ్వక్ సేన్ 'కల్ట్' స్ట్రీమింగ్ ఎందులో అంటే?



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో నటించిన సైకలాజికల్ స్పోర్ట్ థ్రిల్లర్ 'కల్ట్' అనూహ్యంగా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 20 రోజులకే ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రావడం విశేషం. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. 2026 ఆర్ట్‌ఫుల్ 7వ థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, విశ్వక్ సేన్ వరుస విజయాల మధ్య థియేటర్ రన్ పూర్తి చేసుకున్న వెంటనే ఓటీటీలోకి రావడం గమనార్హం. కథ విషయానికి వస్తే, ఒక భారీ పొలిటీ నేపథ్యంగా మొదలైన సంఘటనలు, వరుస హత్యలు మరియు ఉత్కంఠభరిత పరిణామాలతో ప్రమాదకరంగా మారుతుంది. ఆ పరిస్థితుల్లో డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు, అసలు మిస్టర్ ఎంటీ అనే అసక్తికర అంశాలతో ఈ స్పోర్ట్ థ్రిల్లర్ సాగుతుంది. విశ్వక్ సేన్ సరసన గాయత్రి భరద్వాజ్ హీరోయిన్‌గా నటించగా, రావు రమేష్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, ప్రజ్ఞ కీలక పాత్రల్లో కనిపించారు. తరుణ్ భాస్కర్ సంభాషణలు అందించగా, రవి బస్రూర్ సంగీతం సమకూర్చారు. రావు సినిమాస్ ఎల్‌ఎల్‌పీ, పన్యమ్ క్రియేషన్స్ బ్యానర్లపై సుధీర్ కాకరాల, కరాటే రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. థియేటర్లలో మిస్సయిన వారు లేదా కొత్త స్పోర్ట్ థ్రిల్లర్ కోసం చూస్తున్న ప్రేక్షకులు ఎప్పుడు ఇంట్లోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.



M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.